
వార్త
ఆదివారం
29 అక్టోబరు, 2023

# అరచేతి స్వర్గాలు

## పార్టీల మేనిఫెస్టోలు!



# పొలిటీషియన్‌గా మాళవిక?




నందమూరి కళ్యాణ్‌రామ్ విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ, వైవిధ్యమైన సినిమాల్లో నటిస్తూ తనదైన గుర్తింపును సంపాదించుకున్నాడు. ఈయన కథానాయకుడిగా నటిస్తోన్న తాజా చిత్రం 'డెవిల్'. బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్ ట్యాగ్ లైన్. అభిషేక్ నామా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మణిమేఖల పాత్రలో మాళవికా నాయర్ కనిపించనున్నారు. పాన్ ఇండియా లెవల్లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'డెవిల్' సినిమాను నవంబరు 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ చిత్రంలో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఆయన ఛేదించే బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్‌గా నందమూరి కళ్యాణ్‌రామ్ ఆకట్టుకోబోతున్నారు. గత ఏడాది 'బింబిసార'తో మెప్పించిన కళ్యాణ్‌రామ్ ఈ ఏడాది 'డెవిల్'తో మెప్పించటానికి సిద్ధమవుతున్నారు.

# నిర్మాణానంతర కార్యక్రమాల్లో 'భ్రమయుగం'

'భ్రమయుగం' భారీ అంచనాలు నెలకొన్న బహుభాషా చిత్రం. ఈ చిత్రం విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మమ్ముట్టి ప్రధాన పాత్రలో రాహుల్ సదాశివన్ రచన-దర్శకత్వంలో రూపొందుతున్న మలయాళ చిత్రం 'భ్రమయుగం'. హర్రర్ థ్రిల్లర్ జానర్ చిత్రాలను నిర్మించడానికి ప్రత్యేకంగా స్థాపించబడిన నిర్మాణ సంస్థ నైట్ షిఫ్ట్ స్టూడియోస్ ఈ సినిమాని నిర్మిస్తోంది. ఈ చిత్రాన్ని నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. ఒకేసారి మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో 2024 ప్రారంభంలో విడుదల చేయాలని చిత్ర బృందం చిత్రం నిర్మాణాంతర కార్యక్రమాల్లో నిమగ్నమైంది. చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



ఈ చిత్రానికి ఛా యాగ్రహకుడిగా షెహ నాద్ జలా ల్, ఎడిటర్‌గా షఫీక్ మహ మ్మద్ అలీ, సంగీత దర్శకుడిగా క్రిస్టో జేవియర్, మాటల రచయితగా టి.డి. రామకృష్ణన్ వ్యవహరిస్తున్నారు.

ఆదివారం వార్త
29 అక్టోబరు, 2023

## మంచి ముత్యాలు

ఒరనుంచి తీసిన కత్తివంటి శత్రువుకంటే,
మంచిగా ఉంటూ హానిచేసే బంధువు ప్రమాదకారి

- తిరుక్కురళ్

## విషయ విశేషం

దారి చూపించే 'నావిక్'... 4

'సంఘీ'భావం....5
పన్నులతో ఉచితాలు సరికాదు

కవర్ స్టోరీ..6
అరచేతి స్వర్గాలు

పార్టీల మేనిఫెస్టోలు!

కొంజాక్ రైస్‌తో ఆరోగ్యం!.11

ఈవారం కవిత్వం..12

మనసైన జ్ఞాపకం

అణుశక్తి పితామహుడు హోమీబాబా..18

కథ.. 20
తలచనిదే జరిగినదా..!

ఆస్ట్రేలియాలో అరుదైన పర్వతాలు...25

సాహిత్యం..27
ముళ్లపూడి సాహితీ రమణీయం

తూర్పు దిక్కులో సెప్టిక్ ట్యాంక్ ఉంటే?...29

ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### ఎడారి నుంచి విద్యుత్తు



ఇండియా, పాకిస్థాన్‌లలో దాదాపు అయిదు కోట్ల ఎకరాల్లో విస్తరించిన ఎడరి థార్ కను చూపు మేరలో ఇసుక గుట్టలే తప్ప పచ్చదనం కనబడదు. నీటిఛాయలే కనిపించని ఆ మండే ఎడారి ఎండలోంచి కరెంట్‌ను ఉత్పత్తి చేసి దేశ అవసరాలను తీరుస్తోంది ప్రభుత్వం. అదెలాగంటే..రాజస్థాన్‌లోని జోథ్‌పూర్ జిల్లా బడ్లా సమీపంలోని థార్ ఎడరిలో-14వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్‌పార్క్‌ను ఏర్పాటు చేసింది. 2.25 గిగావాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఆ పార్క్‌లో వేలాది సోలార్ ప్యానెళ్లను అమర్చారు. అంతవరకు బానే ఉంది కానీ..వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం పెద్ద ప్రహసనమే. అందుకే చుక్కనీరు కూడా అవసరం లేకుండా చిటికెలో ప్యానెళ్లను శుభ్రం చేసేందుకు సుమారు రెండువేల రోబో యంత్రాలను అమర్చారు. ఈ రోబోలను ఏర్పాటు చేసుండకపోతే వచ్చే పాతికేళ్లలో రెండొందల కోట్ల లీటర్ల నీళ్లను వినియోగించాల్సి వచ్చేదట. మొత్తానికి థార్ ఎడారిలో సోలార్‌పార్కు కరెంటుని ఇవ్వడంతో పాటు గ్రామాల్ని ఇసుక తుపాన్ల నుంచి కూడా రక్షిస్తోంది.

### పెళ్లి చేసే హోటల్



హోటల్‌లో పెళ్లిళ్లు చేస్తుంటారు. అందుకు తగ్గట్టు ఆ ప్రదేశాన్ని చక్కగా పువ్వులతో రకరకాల థీమ్‌లతో అలంకరించడం చూస్తుంటాం. మిగతా అప్పుడు మామూలుగానే ఉంటాయి హోటళ్లు. అయితే ముంబయిలోని ఓ హోటల్ మాత్రం ఎప్పుడూ నిత్యకళ్యాణం పచ్చతోరణం అన్నట్టు కళకళలాడుతుంటుంది. ముందే బుక్ చేసుకోకపోయినా వధూవరులు వెళితే చాలు పెళ్లి ఏర్పాట్లతో రెడీగా ఉంటుంది. అదెలా సాధ్యమంటారా? ముంబయిలోని షాదీముబారక్ హోటల్‌కి ప్రతిరోజు తాజాపువ్వులతో పెళ్లికి చేసినట్లు అలంకరణ చేస్తుంటారు. రెట్రోలుక్‌తో సంగీత్ వేదిక, హాల్దీథీమ్‌తో అలంకరణ ఉంటుంది. మెహందీ డిజైన్లూ పెడతారు. తినడానికి వెళ్లే కస్టమర్లను బ్యాంబ్‌బాజాతో ఆహ్వానించడం అక్కడ ఆనవాయితీ.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# దారి చూపించే 'నావిక్'

**అది** 1999 కార్గిల్ యుద్ధం జరుగుతోంది. భారత సైన్యం చావోరేవో అన్నట్టు పోరాడుతోంది. కార్గిల్ పర్వతాన్ని ఆక్రమించిన ముష్కరులపైన మిసైల్స్ వేస్తోంది. కానీ, ఆ శతఘ్నులు ఎప్పుడూ లక్ష్యానికి ఆమడదూరంలో పడుతున్నాయి! ఈ మిస్సైల్స్‌ని ప్రయోగించడానికి మనం వాడే నావిగేషన్ వ్యవస్థ 'గ్లోబల్ పొజిషినింగ్ సిస్టమ్' (జీపీఎస్) సరిగ్గా పనిచేయకపోవడం ఇందుక్కారణం. ఈ జీపీఎస్ అమెరికా ప్రభుత్వానికి చెందింది. దాంతో కార్గిల్ పర్వతంపైన ఆ వ్యవస్థ బాగా పనిచేసేలా చూడమని భారత్ అగ్రరాజ్యాన్ని ఎంతగానో అభ్యర్థించింది. కానీ ఆనాడు పాకిస్థాన్ తమ మిత్రదేశం కాబట్టి ఆ అభ్యర్థనల్ని అమెరికా పెడచెవిన పెట్టింది. జీపీఎస్ లేకున్నా సరే భారత సైనికుల వీరోచిత పోరాటంతో కార్గిల్ విజయం మన సొంతమైంది. అయినా కీలక ఘట్టంలో జీపీఎస్ సహకారం లేకపోవడాన్ని భారత ప్రభుత్వ యంత్రాంగం మరచిపోలేదు. అందుకే మనకంటూ ఓ నావిగేషన్ వ్యవస్థని రూపొందించాలనుకుంది. ఇందుకోసం 2006లో 'ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్' (ఐఆర్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టుని ప్రారంభించింది. ఈ ప్రాజెక్టుకి డైరెక్టర్‌గా తెలుగు శాస్త్రవేత్త ముప్పాళ్ల నాగేశ్వరరావుని నియమించింది. ముందు మన చిరకాల మిత్రదేశం రష్యాతో కలిసే ఈ ప్రాజెక్టుని చేపట్టాలనుకున్నాం. కానీ ఆ దేశం 'మీ సామర్థ్యంపైన మాకంత నమ్మకం లేదు' అంటూ మధ్యలోనే తప్పుకుంది. భారత్ దాన్నో సవాలుగా తీసుకుంది.



### అమెరికాని తలదన్నేలా

2006 నుంచి ఏడేళ్ల పరిశోధన తర్వాత 2013లో 'ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఎ'తో తొలి నేవిగేషన్ శాటిలైట్‌ని నింగిలోకి పంపింది భారత్. ఆ తర్వాత మరో ఆరు శాటిలైట్‌లని విజయవంతంగా అంతరిక్షంలో నిలబెట్టగలిగింది. ఇందుకోసం రూ 1450 కోట్లు ఖర్చుపెట్టింది. ఒక్క భారత్‌లో మాత్రమే కాకుండా చుట్టుపక్కల మరో 1500 కిలోమీటర్ల దాకా ఇది పనిచేస్తుంది. ముందుగా మన భారత వైమానిక దళం దీన్ని ఉపయోగించడం మొదలుపెట్టింది. అనతి కాలంలోనే అమెరికన్ జీపీఎస్ వ్యవస్థకన్నా ఎక్కువ కచ్చితత్వం (ఆక్యురసీ)తో పనిచేస్తోందన్న పేరు తెచ్చుకుంది. ఉదాహరణకి మీరో కారునో బస్సునో ట్రాక్ చేయాలనుకుందాం లేదా ఓ అడ్రెస్‌ని కనిపెట్టాలనుకుందాం. జీపీఎస్ మీరు కోరుకున్న వాహనం లేదా స్థలానికి 20 మీటర్లు అటూఇటూగా మిమ్మల్ని తీసుకెళుతుంది. కానీ నావిక్ కేవలం ఐదుమీటర్ల వ్యత్యాసాన్నే చూపిస్తుంది. అంటే జీపీఎస్ కన్నా నావిక్ కచ్చితత్వం నాలుగురెట్లు ఎక్కువన్నమాట. ఇప్పుడు మనం వాడుతున్న జీపీఎస్ వ్యవస్థ కొండల్లో పనిచేయదు. కానీ నావిక్ ఏ కొండాకోనల్లో అయినా పనిచేయగలుగుతుంది. 'గూగుల్ మ్యాప్'లాంటి ఆప్‌లని దీనికి అనుసంధానం చేస్తే ఘాట్‌రోడ్డుల్లో జీపీఎస్ కన్నా మెరుగ్గా సేవలందించగలుగుతుంది. ఇప్పటికే మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ తదితర సంస్థలు 'నావిక్'తో పనిచేసే కార్లను రోడ్డుపైకి తెచ్చాయి. అంతేకాకుండా, ఇకపైన మనదేశంలో వాణిజ్యావసరాల కోసం వాడే బస్సులూ, ట్రక్కులూ, కార్లూ తదితర వాహనాలన్నింటికీ ఈ నావిగేషన్ వ్యవస్థని వాడటం తప్పనిసరి చేస్తుంది కేంద్ర ప్రభుత్వం. ఆ తర్వాత మొబైల్ ఫోన్ తయారీదారులూ దీన్ని వాడేలా చర్యలు చేపట్టింది. ముందుగా రియల్ మీ, షామీ, వన్‌ప్లస్, ఒప్పో వంటి సంస్థలు నావిక్‌తో పనిచేసే ఫోన్లని మార్కెట్‌లోకి తెచ్చాయి. వీటికి తలమానికంగా ఆపిల్ సంస్థ తమ తాజా 'ఐఫోన్ 15ప్రొ' మొబైల్‌ని 'నావిక్ వ్యవస్థకి అనుగుణంగా మార్చుచేసింది. 2025కల్లా అన్ని స్మార్ట్‌ఫోన్లనూ నావిక్‌ని వాడటం తప్పనిసరంటూ కేంద్రం ప్రకటించడంతో ఇతర సంస్థలూ దాదాపు అన్ని ఫోన్లలోనూ ఈ వ్యవస్థని తీసుకురాబోతున్నాయి.

### మనం కూడా గ్లోబల్‌కి

1973లో ప్రారంభమైన అమెరికన్ జీపీఎస్ వ్యవస్థ ప్రస్తుతం 32 శాటిలైట్‌లతో ప్రపంచవ్యాప్తంగా ఉచిత వరాల్ని అందిస్తోంది. రష్యా (గ్లోనాస్), యూరోపియన్ యూనియన్ (గలీలియో), జపాన్ (క్యూజర్ ఎస్ఎస్), చైనా (బైడూ)లకీ ఈ వ్యవస్థ ఉన్నా అవి ఆయాదేశాలకే పరిమితమవుతున్నాయి. కానీ అమెరికాలాగే భారత్ కూడా ప్రపంచవ్యాప్తంగా సేవలందించడానికి సిద్ధమవుతోంది. ఇందుకోసం, సమీప భవిష్యత్తులో 24 శాటిలైట్‌లని నింగిలోకి పంపబోతున్నాం. ❑

# 'సంఘీ' భావం



# పన్నులతో ఉచితాలు సరికాదు

రాజకీయ పార్టీలు ఓట్ల కోసం గత కొన్ని ఎన్నికల నుంచి ఉచితాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. అధికారం చేజిక్కించుకోవడానికి ఉచితాలు తాయిలాలుగా ప్రకటించి అధికారంలోకి వస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఉచితాలే కాకుండా కొన్ని వర్గాలకు చెందిన ప్రజల కోసం తాహాతుకు మించిన ఉచిత పథకాలను ప్రవేశపెడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి వివిధ రూపాలలో వస్తున్న ఆదాయాన్ని కేవలం ఉచిత పథకాలకు ఖర్చు పెట్టేందుకే సరిపోతోంది. ప్రజల నుంచి ప్రభుత్వాలు వివిధ రూపాలలో పన్నులు వసూలు చేస్తారు. వసూలు చేసిన పన్నుల మొత్తం ఖజానాకు చేరుతుంది. రాష్ట్రంలో వివిధ పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించాల్సి ఉంటుంది. విద్య, వైద్యం వంటి కొన్ని కార్యక్రమాలకు మాత్రం ఉచితంగా అందించేందుకు వెసులుబాటు ఉంది. దీనివల్ల అనేక ఉపయోగాలు కూడా ఉన్నాయి. అందరికీ విద్య వల్ల ఆయా ప్రాంతాలు, రాష్ట్రాల పరిస్థితి మెరుగు పడుతుంది. ఇదేవిధంగా వైద్యాన్ని నిరుపేదలకు ఉచితంగా అందేలా చేయడానికి నిధులు ఖర్చు చేయడానికి సర్వత్రా ఆమోదం ఉంది. ఇక ఉద్యోగుల జీతాలు, నిర్వహణ వ్యయాలు తప్పవు. ఈ సమయంలో కొన్ని సందర్భాల్లో ఉచితంగా ఇవ్వవలసిన పరిస్థితులు ఉంటాయి. ఉదాహరణకు కరోనా సమయంలో వాక్సిన్లు ఉచితంగా ఇచ్చారు. అనేక కుటుంబాలు ఉపాధిని, వ్యాపారాలను కోల్పోవడంతో ఉచితంగా బియ్యం, కిరాణా సామాగ్రిని ఇవ్వడం జరిగింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా సహాయక శిబిరాలు ఏర్పాటుచేసి భారీ మొత్తంలో ఖర్చు చేస్తారు. ప్రజలను విపత్కర పరిస్థితుల నుంచి ఆదుకునే బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం చేపట్టే పనులకు ప్రజల నుంచి మద్దతు ఉంటుంది. అంతే కాకుండా ఈ సమయంలో చాలామంది ముందుకు వచ్చి తమకు తోచిన సహాయాన్ని ప్రభుత్వానికి, బాధిత ప్రజలకు అందిస్తారు. ఇలాంటి కార్యక్రమాలు జరగాలంటే ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల రూపంలో వచ్చిన నిధులను ఖర్చుచేస్తున్నారు. ఇది ఎప్పటి నుంచో అమలులో ఉంది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ప్రజలను ఆకట్టుకోవడానికి ఎటువంటి ఫలితాన్ని ఇవ్వని ఉచితాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది క్రమంగా విస్తరిస్తూ వస్తోంది. కొన్ని కుటుంబాలకు ఉచితాల వల్ల వ్యక్తిగత ప్రయోజనం ఉండటంతో వారు మాత్రమే ఈ ఫలితాలను అనుభవిస్తున్నారు. అయితే అభివృద్ధికి, కొన్ని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఖర్చు చేయాల్సిన నిధులు కేవలం కొన్ని కుటుంబాల వ్యక్తిగత అవసరాలకు కోసం కేటాయించడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ విధానం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లో అమలులో ఉంది. ప్రజలకు నేరుగా నగదు బదిలీని ఉచితంగా అందించడం కంటే వారు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయడం వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఉదాహరణకు రెండు రాష్ట్రాల్లో రైతులకు ఉచితంగా నిధులు అందించే పథకాలు అమలులో ఉన్నాయి. దీనితో కోట్లాది రూపాయలు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అవుతోంది. దీనికి బదులు ఆ నిధులతో వ్యవసాయ రంగానికి పనికివచ్చే అభివృద్ధి కార్యక్రమాలను చేపడితే దిగుబడి పెరిగి రైతులే ప్రభుత్వానికి తిరిగి పన్నుల రూపంలో ఆదాయాన్ని సమకురుస్తారు. ఇక విద్యార్థుల కుటుంబాలకు నగదు బదిలీ జరుగుతోంది. దీనివల్ల విద్యావ్యవస్థకు ఒరిగిందేమీ ఉండదు. సర్కారు బడులంటేనే సమస్యలకు నిలయంగా కనిపిస్తాయి. ఉపాధ్యాయుల కొరత పీడిస్తోంది. ముఖ్యంగా సైన్స్, లెక్కలు వంటి సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. ఈ సబ్జెక్ట్‌లు చెప్పే టీచర్లను నియమించాల్సిన అవసరం ఉంది. అనేక పాఠశాలల్లో తరగతి గదులు కొరతగా ఉన్నాయి. దీనితో రెండు మూడు తరగతులు ఒకే గదిలో ఒకే టీచరుతో నిర్వహిస్తున్న పాఠశాలలు ఉన్నాయి. కొన్ని భవనాలు శిధిలావస్థకు చేరుకున్నాయి. అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవు. దీనితో విద్యార్థినిలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో చాలామంది విద్యార్థిని మరుగుదొడ్డికి వెళ్లాల్సి వస్తుందని నీరు తాగడం మానివేస్తున్నారు. ఈ కారణంగా వీరు అనేక రుగ్మతలకు గురౌతున్నారు. వీటిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. చిన్న వర్షం పడితే చాలు చిత్తడిగా మారి ప్రయాణానికి వీలు లేకుండా ఉంటున్నాయి. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశాలలు లేకపోవడంతో జ్వరాలు, రోగాలు వస్తే కావడి మోసి రోగులను ఆసుపత్రులకు తరలిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోతే వారికి అంబులెన్స్‌లు అందుబాటులో ఉండవు. ఆ సమయంలో మృతుల బంధువులు మృతదేహాలను బైకులు, తోపుడు బండ్లపై తీసుకు వెళ్లే ఘటనలు నిత్యం కనిపిస్తున్నాయి. ఇన్ని సమస్యలు ఉన్నప్పుడు పట్టించుకోని ప్రభుత్వాలు ఉచితాలకు మాత్రం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ తరుణం లో ప్రజల్లో ప్రస్తుతం ఒక ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ప్రభుత్వా లు ఉచితంగా నిధులను బదిలీ చేసే స్థాయి ఉన్నప్పుడు తాము ఎందుకు పన్నులు కట్టాలని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం చర్చల స్థాయిలో ఉన్న ఈ ప్రశ్న ఉద్యమ రూపంలో మారినప్పుడు ప్రభు త్వాలు, వాటిని అనుసరించే రాజకీయ పార్టీలకు తగిన రీతిలో గుణపాఠం లభించే అవకాశం లేకపోలేదు. ఏదైనా అవసరమైన స్థాయిలోనే ఉండాలి కాని అవి అతికి మారినప్పుడు ప్రజల్లో చైతన్యం వస్తుందని గ్రహించాల్సిన పరిస్థితి ఎదురుకానుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# అరచేతి స్వర్గాలు పార్టీల మేనిఫెస్టోలు!

కవర్ స్టోరీ

**బండారు రామ్మోహనరావు**

దేశ వ్యాప్తంగా డెంగ్యూ, చికెన్ గునియా జ్వరాల వ్యాప్తి వేగంగా జరుగుతుంది. దాంతో పాటు అక్టోబరు 5 నుండి నవంబరు 19 వరకు మన దేశంలో జరిగే వన్డే ప్రపంచ కప్ సంబరాల జ్వరం ఒకవైపు కొనసాగుతుంది. మరోవైపు తెలంగాణ చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల ఎన్నికలకు షెడ్యూలు వచ్చింది. నవంబర్ 30 నాటికి ఈ ఐదు రాష్ట్రాలలో విడతల వారీగా పూర్తవుతుంది. ఒకవైపు దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బిజెపితో సహా తెలంగాణలో ప్రాంతీయ పార్టీ అయిన భారత రాష్ట్ర సమితితో సహా అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థుల జాబితాలు వెల్లడిస్తున్నాయి. అలాగే మరోవైపు తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే విషయాలను వివరిస్త మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నాయి. దేశంలో పోలింగ్ జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల జ్వరం కరోనా వైరస్ కంటే వేగంగా పరిగెడుతుంది.

## ఒకరి కంటే ఒకరు ముందు

2023 సంవత్సరాంతానికి తెలంగాణ రాష్ట్రంతో పాటు చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల అసెంబ్లీల కాలం ముగుస్తుంది. అందుకే ఈ సంవత్సరానికి ఈ రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయని ముందే ఊహించిందే. ఆయా రాష్ట్రాలలో ఉన్న ప్రధాన రాజకీయ పక్షాలు ఇప్పటికే ఎన్నికల అస్త్ర శస్త్రాలను పదును పెట్టుకుంటూ సిద్ధం చేసుకుంటున్నాయి. మేమేమి తక్కువ తినలేదని దేశంలో ఉన్న రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపి కూడా ఆయా రాష్ట్రాలలో తమ రాజకీయ కలాపాలను ముమ్మరం చేశాయి. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పార్టీ ప్రచారంలో తల మునకలై ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఆయన వరుస పర్యటనలు చేశారు, ప్రస్తుతం చేస్తున్నారు. తెలంగాణ విషయానికి వస్తే జాతీయ పార్టీల ప్రధాన నాయకుల వరుస వలస పర్యటనలు జరుగుతూనే ఉన్నాయి. మొన్నటికి మొన్న సెప్టెంబరు 17న అమిత్‌షా, అక్టోబర్ 1,3 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో పర్యటించారు. అలాగే మరొక జాతీయ పార్టీ కాంగ్రెస్ ఏకంగా హైదరాబాద్ వేదికగా సిడబ్ల్యూసి సమావేశమే నిర్వహించింది. అంతేకాకుండా అభ్యర్థుల ఎంపికలో మొదటి విడత 55 మందితో అభ్యర్థుల జాబితాను ప్రకటించి మిగతా అభ్యర్థుల విషయంలో కొంచెం వెనుకబడి ఉన్నా ఉచిత హామీల తాయిలాలు గుప్పించే మేనిఫెస్టో ప్రకటనలో అన్ని పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ ముందుంది. మూడు పువ్వులు ఆరు కాయల సామెతను గుర్తు చేస్తూ 6 గ్యారంటీలు 12 హామీలు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇప్పటికే తన మేనిఫెస్టోను ప్రకటించింది. ఆ గ్యారెంటీలకు తమ పార్టీ అధిష్ఠాన వర్గం మద్దతు ఉందని చెప్పడానికి తెలంగాణ ఇచ్చిన దేవతగా వర్ణిస్తున్న సోనియాగాంధీ ఆమె కుమారుడు రాహుల్‌గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీని తెలంగాణ రాష్ట్రానికి తీసుకువచ్చి వారి ద్వారా ఆ గ్యారెంటీ హామీని బహిరంగ సభలో ప్రకటింపచేసింది. వాటిని కొనసాగిస్తూనే మళ్లీ రెండో విడత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రామప్ప దేవాలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుండే బస్సు యాత్రను ప్రారంభించి ములుగు, పెద్దపల్లి, కరీంనగర్ బహిరంగ సభలలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇస్తున్న ఈ గ్యారెంటీలు, హామీలన్నీ తాము ఇప్పటికీ అమలు చేస్తున్న పథకాలకు కొనసాగింపు మాత్రమే తప్ప మరొకటి కాదని బిఆర్ఎస్ పార్టీ వాదిస్తుంది. ఒక్క కొత్త పథకం కూడా కాంగ్రెస్ ప్రకటించలేదని రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ విమర్శిస్తుంది.

## 'నేనే గ్యారెంటీ' అంటున్న మోడీ!

ఒక్కరోజు తేడాలోనే అక్టోబర్ 1,3 వ తేదీలలో తెలంగాణ రాష్ట్రంలో వరస పర్యటనలు చేసిన నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీ పార్టీగా మాత్రమే గ్యారెంటీ ఇచ్చింది. కానీ తెలంగాణ

సమాజానికి 'నేనే గ్యారంటీ' అని తనకు తానే కితాబు ఇచ్చుకొని గతంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేసిన డీకే బారువా 'ఇందిరాయే ఇండియా-ఇండియాయే ఇందిరా' అనే మాటలను గుర్తు చేశారు. అలాగే తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా ఇంకా నోటిఫికేషన్ విడుదల కావడానికి సమయం ఉన్నందున ఈ లోపే మరొక రౌండ్ వేయడానికి అమిత్ షా నరేంద్రమోడీతో సహా స్మృతి ఇరానీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అస్సాం రాష్ట్ర ముఖ్యమంత్రి శర్మ తదితరులను ఈ అక్టోబర్ నెలలోనే ప్రచారానికి దించింది. టిఆర్ఎస్ కాంగ్రెస్ బిజెపిలలో మొదట అభ్యర్థులను ప్రకటించి బిఆర్ఎస్ ఎన్నికల సమర శంఖాన్ని పూరించింది. ఆ తర్వాత కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రకటిస్తే తర్వాత చర్యగా అక్టోబర్ 15 స్వయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు సెంటిమెంటు పరంగా వర్కౌట్ అయిన పూర్వపు కరీంనగర్ జిల్లా ప్రస్తుత సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్ నుండి తన పార్టీ మేనిఫెస్టోను ప్రకటించారు. ఆ తర్వాత మూడు రోజుల్లో అక్టోబర్ 16, 17, 18 తేదీలలో జనగామ భువనగిరి సిరిసిల్ల సిద్ధిపేట, జడ్చర్ల, మేడ్చల్ పట్టణాలలో ప్రజా ఆశీర్వాద సభల పేరిట వరుస సభలతో కెసిఆర్ తనదైన రీతిలో ఎన్నికల ప్రచార సభలలో ప్రసంగించారు. ఇప్పటివరకు అయితే మూడు ప్రధాన పార్టీలలో అభ్యర్థుల ప్రకటన, మేనిఫెస్టో ప్రకటనలో వెనకబడింది బిజెపి మాత్రమే అని చెప్పవచ్చు.



## ఎన్నికలప్పుడే ఓడ మల్లయ్యలా?

గత తొమ్మిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీల ఊసే తలవని ప్రధాన మంత్రి మోడీ కృష్ణా జలాల వివాదం పరిష్కారానికి ఇప్పటికే అమలులో ఉన్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కి అప్పజెప్పడం మొదలుకొని పసుపుబోర్డు ఏర్పాటు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, దేశ వ్యాప్తంగా ఉజ్వల గ్యాస్ వినియోగదారులకు మొన్నటి నుండే అమలవుతున్న 200 రూపాయల సబ్సిడీకి తోడుగా కొత్తగా మరొక 100 రూపాయల సబ్సిడీ అదనంగా పెంచారు. "రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా" అన్నట్లు ప్రధానమంత్రి ప్రకటన తర్వాతే యూనియన్ క్యాబినెట్ వీటిని ఆమోదించింది. ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే మొన్నటికి మొన్న కర్ణాటకలో ఇచ్చిన ఐదు హామీలకు తోడు మరొక హామీని జతపరిచి తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు 14 పథకాలను ప్రకటించింది. ఇందులో ప్రధానంగా గ్యాస్‌బండ సబ్సిడీని బిజెపి 300కు పరిమితం చేస్తే గృహ వినియోగదారులందరికీ కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తే ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటన చేసింది. దానికితోడు ప్రతి ఇంటికి 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు ఇస్తామని కూడా వారు చెప్పారు. దానికితోడు రాష్ట్రంలోని 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి నెల 2500 జీవన భృతిని కూడా ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఇక టిఆర్ఎస్ "కాంగ్రెస్ మా పథకాలనే నకలు కొట్టింది" అని విమర్శిస్తూనే తెల్లకార్డు కలిగిన కుటుంబాలలో ఉన్న మహిళలకు నెలకు 3000 రూపాయలు పెన్షన్ ఇస్తామని ప్రకటించింది. అలాగే రాష్ట్రంలో ఉన్న 93 లక్షల తెల్లకార్డుదారులకు అందరికీ ఐదు లక్షల ఉచిత బీమా సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ తమ పథకాలను కాపీ కొట్టిందని విమర్శిస్తుంటే, టిఆర్ఎస్ కొనసాగింపును మాత్రమే కాంగ్రెస్ తీసుకుంటుందని ప్రతివిమర్శ చేస్తుంది.

## ఇచ్చిన హామీలు అమలయ్యేనా?

ప్రస్తుతం కాంగ్రెస్ టిఆర్ఎస్‌తో పాటు బిజెపి ప్రకటించబోయే, ప్రజలకు ఇచ్చే ఉచిత హామీల సంగతిని ఒకసారి పరిశీలిస్తే ఇవి అమలు అయ్యేవేనా అని అనిపిస్తుంది. ఇప్పటివరకైతే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు ప్రతి సంవత్సరం సుమారు 70,000 కోట్ల రూపాయల ఆర్థిక వనరులు అవసరమవుతాయి. టిఆర్ఎస్ ప్రస్తుతం తెలంగాణ ప్రజలకు ఇస్తున్న, అమలు చేస్తున్న హామీల కంటే పెంచిన కొనసాగింపుకు మరొక 30 వేల కోట్ల రూపాయలు అదనపు భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడుతుంది. ఇక బిజెపి హామీల సంగతి తెలిస్తే ఇంకా ఎంత భారం పడుతుంది అనేది సరైన అంచనాకు రావచ్చు.

ప్రజాస్వామ్య విలువలతో, అంతర్గత ప్రజాస్వామ్యంతో, ఉమ్మడి రాజకీయ నాయకత్వంతో నడవాల్సిన రాజకీయ పార్టీలు ఏక వ్యక్తి పాలనలో మగ్గిపోతున్నాయి. ఇక ప్రాంతీయ పార్టీలు అన్ని ప్రైవేట్ ఆస్తులుగా మారిపోయాయి. పార్టీ అంటే తామే, తామంటే పార్టీయే అనే విధంగా ప్రాంతీయ పార్టీల వ్యవస్థాపకులు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేపటి ఎన్నికలలో అనుచిత ఉచితాల ఎన్నికల తాయిలాల వరద వెల్లువలా పారనుంది. తెలంగాణలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ తాను మాత్రం మిగతా పార్టీల కంటే తగ్గేదేలే అంటూ ఎన్నికల వాగ్దానాల హామీల మూటను అక్టోబర్ 15న హుస్నాబాద్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో



విప్పింది. మీరు ప్రస్తుతం ప్రకటించిన దానికంటే మరిన్ని ఆకర్షణీయమైన ఉచితాలు తాయిలాలు ప్రకటిస్తామని వేరే పార్టీలకు సవాలు విసురుతూ ఈ విషయాన్ని బహిరంగంగానే ముందుగానే చెప్పుకుంటోంది. ఇప్పటికే 119 అసెంబ్లీ నియోజక వర్గాలలో 115 మంది అభ్యర్థులను ప్రకటించి మిగతా పార్టీల కంటే ఒక అడుగు ముందే ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉంది కనుక శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పేరిట ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రమంతటా సభలు, సమావేశాలు పెట్టి తెగ తిరుగుతున్నారు. ఇక జాతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలో అభ్యర్థుల ఎంపికకు అప్లికేషన్లు ఆహ్వానించి వచ్చిన వేలాది అప్లికేషన్లలో టికెట్లు ఎవరికి ఇవ్వాలా అని మల్లగుల్లాలు పడుతున్నాయి.

ఈ దశలో రాష్ట్రాల ఖజానాతో ఆర్థిక వెసులుబాటు, సాధ్యాసాధ్యాలతో నిమిత్తం లేకుండా ఒకరి కంటే ఒకరు అన్ని వర్గాల ప్రజలకు అనుచిత ఉచిత హామీలు ఇబ్బడి ముబ్బడిగా ఇచ్చాయి. ఇంకా ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ కొత్త హామీలు ఇవ్వనున్నాయి. రాష్ట్రాలలో అభివృద్ధి, మౌలిక వసతులు ఏర్పాటు విద్య, ఆరోగ్య, సేవల మెరుగుదల, యువతకు ఉపాధి, వ్యవసాయాన్ని లాభసాటి చేయడం, అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి కల్పించడం, రోడ్లు, వీధి దీపాలు, మురుగు కాలువలు నిర్మించడం, సాగు, తాగునీటి సౌకర్యం కల్పించడం, నివాస యోగ్యమైన గ్రామాలు, పట్టణాలను తీర్చిదిద్దడం.. ఇలాంటి అవసరమైన పనులను పక్కన పెట్టి 'ఫక్తు' నగదు బదిలీ స్కీములను ప్రవేశపెట్టే ఆలోచనలతో అన్ని సాంప్రదాయ రాజకీయ పక్షాలు ఒకరిని మించి మరొకరు పోటీలు పడుతున్నాయి.



## తమిళనాడు రాష్ట్రాన్ని తలదన్నిన బి.ఎస్.పి.హామీలు

ఇక తెలంగాణ రాష్ట్రంలో మరొక జాతీయ పార్టీ భారతీయ సమాజ్ వాది పార్టీ(బిఎస్‌పి) రాష్ట్ర నాయకుడు గతంలో పోలీసు అధికారిగా పనిచేసే విద్యాశాఖలో కూడా గురుకుల విద్యాలయాల స్థాపనలో వాటిని నడిపించడంలో మంచి పేరు తెచ్చుకున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా సాంప్రదాయ పార్టీ(సారా) వలలో చిక్కుకుపోయారు. నిన్నగాక మొన్న వారు ప్రకటించిన బిఎస్పీ మేనిఫెస్టో చూస్తే వారు కూడా అనుచిత ఉచితాలను ఎన్నింటినో సాంప్రదాయ రాజకీయ పక్షాల కంటే ఎక్కువే ఇచ్చేటట్లు కనిపించింది. అందులో ప్రధానంగా మహిళలకు వాషింగ్ మిషన్లు, లాప్ టాప్‌లు, మిక్సీలు, గ్రైండర్లు ఇస్తామని హామీలు కూడా గుప్పించారు. ఈ హామీలు చూస్తే తమిళనాడు రాజకీయాలు గుర్తుకొస్తున్నాయి. మిక్సీలు, గ్రైండర్లు, వాషింగ్ మెషిన్లు, టీవీలు, లాప్ టాప్‌లు, సైకిళ్లు, మోపెడ్లు మన తెలంగాణ రాష్ట్రంలో కూడా రాజకీయ ఎన్నికల మేనిఫెస్టో హామీలుగా చేరిపోయాయి.

## కార్పొరేట్లకు రైట్ ఆఫ్‌లు పేదలకు ఉచితాలు వద్దా?

ఈ ఉచిత హామీలను వ్యతిరేకించే వాదనకు వ్యతిరేకంగా దేశంలో మరొక వాదన వినిపిస్తుంది. కార్పొరేట్ సంస్థలకి పలుకుబడి ఉన్న వ్యాపారులకి లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేస్తూ వాటిని రైట్ ఆఫ్‌గా పేర్కొంటూ ప్రజల సొమ్మును పెద్దలకు పందేరం చేస్తున్న ప్రభుత్వాల సంగతి ఏమిటని వీరు ప్రశ్నిస్తున్నారు. ఈ వాదన కూడా నిజమే. ఎందుకంటే భూములతో పాటు ఇతర ఉత్పత్తి వనరులు, సంపద అంతా ఒకవైపు కేంద్రీకృతం అవుతున్న సమాజంలో పేద ప్రజల జీవన భద్రతకు అవసరమైన చర్యలు ఆయా ప్రభుత్వాలు చేపట్టాల్సిందే. కానీ అవి శృతి మించి రాగాన పడ్డప్పుడు మాత్రమే కష్టాలు వస్తాయి.

ఉద్యోగుల పాత పెన్షన్ విధానం మరింత ప్రమాదకరం ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు సంబంధించిన పాత పెన్షన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా రాష్ట్రాల్లో రద్దుపరిచింది. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని గత 20 ఏళ్లుగా కొనసాగిస్తోంది.

ఆయా రాష్ట్రాలు దీనికి ఒప్పుకొని ఈ పెన్షన్ విధానాన్ని అవలంభిస్తున్నాయి. కానీ ప్రస్తుతం ఉద్యోగుల వత్తిడికి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మళ్లీ ఓల్డ్ పెన్షన్ స్కీంకు మళ్లీ మళ్లుతున్నారు. కానీ ఉభయ తెలుగు రాష్ట్రాలలో ముఖ్యమంత్రులు ఈ విషయంలో కొంత ఆచరణాత్మక ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఉద్యోగుల వత్తిడికి లొంగకుండా కఠిన వైఖరిని అనుసరిస్తున్నారు. కానీ ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి అటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు చూస్తే మిగతా రాష్ట్రాల లాగానే వీరు కూడా మరి ఓల్డ్ పెన్షన్ స్కీంను మళ్లీ తీసుకువస్తామని ప్రకటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దానివల్ల రాష్ట్ర ఆర్థిక స్థితి మరింత అధ్వాన్నంగా మారుతుంది. ఉద్యోగుల ఓట్ల కోసం ఈ పని చేస్తే రాష్ట్రాలలో ఉన్న పేద ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టడమే అవుతుంది.





అందుకే ఈ విషయంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఆచి తూచి ఆలోచించి అడుగు వేయడం మంచిది. లేకపోతే 'అయ్యగారి సంపాదన అమ్మగారి పసుపు-కుంకుమలకే సరిపోతుంది' అనే సామెత నిజమవుతుంది.

## ఏది ఉచితం.. ఏది అనుచితం?

అవసరమైన సంక్షేమ పథకాలు ఎవరూ వద్దనరు. మెరుగైన సమాజం కోసం సంక్షేమం, అభివృద్ధి రెండు కూడా బండి చక్రాల్లాగా కొనసాగాల్సిందే. అనవసర అనుచిత ఉచితాలు వ్యతిరేకించాల్సిందే. ఓటు బ్యాంకు రాజకీయాల విష వలయంతో అన్ని అధికార, విపక్ష రాజకీయ పక్షాలు చిక్కుకొని విలవిలలాడుతున్నాయి. వీటిని నిజాయితీగా వ్యతిరేకిస్తే తమకు ఓట్లు పడవనే భయంతో ఒకరిని మించి మరొకరు ప్రజలు అడగని హామీలు కూడా ఇస్తున్నారు. ప్రజలకు ఏది అవసరమో ఏది అనవసరమో కనీస విచక్షణా జ్ఞానంతో ఆలోచించే పరిస్థితి కూడా వీరికి ఉండడం లేదు. అందుకే ఏ పార్టీ కూడా మిగతా పార్టీలకు భిన్నంగా వ్యవహరించడం లేదు. తాము ఒకటంటే మరొకరు రెండు అంటున్నారు. పెరుగుట విరుగుట కొరకే అన్నట్లు ఈ అనుచిత ఉచిత హామీలు తడిసి మోపెడై రాష్ట్రాల ప్రగతి కుంటుపడుతుంది. దీంతో దేశ ప్రగతి కూడా కునారిల్లుతుంది.

## పిల్లిమెడకు ఎవరు గంట కట్టాలి?

అనుచిత ఉచితాలను వ్యతిరేకించే 'పిల్లి మెడకు' ఎవరు గంట కట్టాలి? ఒకసారి దేశ ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఎన్నికల ఆపద్ధర్మ పథకాలు చాలాసార్లు వర్కవుట్ కాలేదు. 1982లో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి మొట్టమొదట రెండు రూపాయలకు కిలో బియ్యం అనే ఎన్నికల హామీని ప్రకటించారు. దాన్ని ఓడించడానికి



అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఒక్క రూపాయి కిలో బియ్యం ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ అందించారు. ఒక రూపాయి హామీని పక్కన పెట్టి రెండు రూపాయలకు కిలో బియ్యం హామీనే ప్రజలు ఆదరించి ఎన్టీ రామారావును ఆ ఎన్నికలలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు గెలిపించారు. అలాగే తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత ఆపద్ధర్మ హామీలు ప్రజలు నమ్ముతారా, నమ్మరా? అనే రెండు ఉదాహరణలు నేను చెబుతాను.

మొదటిది 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. కానీ తాము మాత్రం 1 లక్ష రూపాయల రుణమాఫీ మాత్రమే చేయగలుగుతామని ఆనాటి అధికార పార్టీ టిఆర్ఎస్ ప్రకటించింది. ఒక లక్ష కంటే రెండు లక్షలు ఎక్కువైనా సరే కానీ ప్రజలు టిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి మళ్లీ టిఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టారు. అలాగే విభజిత ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగుదేశం నాయకుడు చంద్రబాబు నాయుడు పసుపు-కుంకుమ అనే పథకాన్ని 2019 అసెంబ్లీ ఎన్నికల కన్నా ముందు ప్రవేశపెట్టి అమలు చేశారు. కానీ నవరత్నాలు అనే హామీతో వచ్చిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు గెలి పించారు. ఇలాంటి ఉదాహరణలు మన రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. ఉచిత హామీల మీదనే రాజకీయాలు నడుస్తాయా? లేక వారి ప్రభుత్వం పనితీరు నిజాయితీ ఈ విషయాలు పరిగణలోకి వస్తాయా? అన్న విషయాలను రాజకీయ పార్టీలు గమనించాలి. ఎన్నికల్లో ప్రజలు నిర్ణయం ఎలా ఉంటుందో ఈ నిజాన్ని తెలుసుకుంటే రాజకీయ పార్టీలు ప్రజలకు ఇస్తున్నవి 'వరాలా? శాపాలా?' అనే విషయం అర్థం అవుతుంది. ❑





# టేస్టీ చిప్స్

చిప్స్ కనిపిస్తే చాలు ఎన్ని తింటుమన్నది గమనించకుండా ఒకదాని తరువాత ఒకటి తినడం చాలా మందికి అలవాటు. అవి అనారోగ్యమని తెలిసినా జిహ్వా చాపల్యం ఆపుకోలేక తినేస్తుంటారు కొందరు. అలాంటి వారికోసం ఇప్పుడు ఓట్స్, బార్లీ, క్వినోవా, రాగి, జొన్నపిండి మొదలైన వాటితో తయారు చేసిన అనేక రకాల చిప్స్‌లు దొరుకుతున్నాయి.

ఈ చిప్స్ బిస్కెట్, రిబ్బన్ మురుకు ఆకారంలో సైతం లభిస్తున్నాయి. వాటిలో ఉపయోగించే పదార్థాన్ని బట్టి రంగు ఉంటుంది. వీటిలో బియ్యప్పిండి, మొక్కజొన్న పిండి, మినప్పిండి, మసాలాలు మొదలైనవి కలుపుతారు కనుక రుచి కూడా విభిన్నంగా ఉంటుంది. వీటివల్ల ఏమాత్రం హాని ఉండదు కనుక తనివితీరా తినవచ్చన్నమాట.

# మసాలా ఉప్పు

ఏ వంటకంలోనైనా అవసరమైనంత ఉప్పు వేస్తేనే రుచి వస్తుంది. అలాగే వంటకాన్ని బట్టి వెల్లుల్లి, జీలకర్ర, వాము, అల్లం మొదలైన పదార్థాలను వేస్తుంటాం. అయితే సలాడ్, సూప్, పిజా మొదలైన వాటికి అదనంగా ఒరెగానో, రోజ్‌మేరీ లాంటి వేయాల్సి వస్తుంది. అలాంటి పదార్థాలన్నీ ఇప్పుడు ఉప్పులోనే కలిపి తయారు చేస్తున్నారు. ఉప్పులోనే వెల్లుల్లి పొడిని కలిపిన గార్లిక్ సాల్ట్ కూరలకు, మాంసాహారానికి మంచి రుచి కలిగిస్తే; పండ్లు, కూరగాయలతో చేసుకునే సలాడ్‌ల కోసం పసుపు-మిరియాల పొడి కలిపి తయారు చేసిన ఫ్రూట్ సాల్ట్ లభిస్తోంది మార్కెట్లో. అదే విధంగా మసాలా కూరల్లో వేసుకునేందుకు వీలుగా మసాలా సాల్ట్, ఎండుమిర్చి గింజలు కలిపిన రెడ్ చిల్లీ సాల్ట్, తాలింపుల్లో వేసుకునేందుకు కర్రీ సాల్ట్, ఇంగువ జీరా ఉప్పు, లెమన్ జింజర్ లాంటి ఎన్నో రకాలు వస్తున్నాయిప్పుడు. సోడియం శాతం కూడా కొంతవరకు తగ్గుతుందనీ, రెండు మూడు రకాల పదార్థాలు వేయకుండా ఒకేదానితో సరిపోతుందని అంటున్నారు.



# 'తేనె' రుచులు

జలుబు చేసినా, దగ్గినా తేనెలో శొంఠిపొడి లేదా దాల్చిన చెక్క పొడి లాంటివి కలిపి తీసుకుంటే ఉపశమనం లభిస్తుందని పెద్దలు చెబుతుంటారు. పండ్లముక్కల పైన పంచదారకు బదులుగా కొద్దిగా తేనెను వేసుకోవడం పరిపాటి. ఆ శ్రమ లేకుండా ఇప్పుడు కోరుకున్న రుచుల్లో తేనె దొరుకుతోంది. పసుపు, చాక్లెట్ లాంటి తేనె మొదలైనవి అందులోని రకాలు. అలాగే జామూన్, స్ట్రాబెర్రీ, జామ వంటి పండ్ల రుచుల్లో చేసిన తేనె కూడా వస్తోంది. ఇవన్నీ తేనెలో రకాలే కానీ వీటిలో దాల్చినచెక్క, లవంగాలు, మసాలా, పసుపు, నిమ్మ లాంటివి కలపడం వల్ల వాటికి ఆ ఆర్థాల తాలూకు రుచి అదనంగా వచ్చి తేనె కాస్త ఘాటుగా, పుల్లగా, మసాలా రుచిలో ఉంటుంది. కొకోవా తేనెనె తీసుకుంటే ఇందులో చాక్లెట్‌ను కలపడం వల్ల దీన్ని నేరుగా తినడంతో పాటు జామగా కూడా వాడుకోవచ్చు. ఎప్పుడైనా అనారోగ్యంగా అనిపించినప్పుడు తేనెలో అదనంగా పదార్థాలు కలపడం కన్నా నేరుగా ఎంచక్కా వీటిని వాడుకోవచ్చు.





# కొంజాక్ రైస్‌తో ఆరోగ్యం!

**కొంజాక్** దుంపేమిటీ..బియ్యం ఏమిటీ..అందులో క్యాలరీలు ఉండకపోవడమేంటీ అనిపిస్తుంది కదా! నిజమే కంద, కర్రపెండలం మాదిరిగానే ఇదీ ఒక రకం దుంప మొక్క ఆసియా దేశాల్లో పెరుగుతుంది. దీన్నిపుడూ లిలీ, స్నేక్ పామ్ అనీ పిలుస్తారు. కొరియా, జపాన్, చైనాల్లో దీని వాడకం ఎక్కువ. ఈ పిండి జిగురుగా ఉండటంతో దీంతో చేసిన నూడుల్స్, పాస్తా వంటివి ఇష్టంగా తింటుంటారు. ఈ పిండిలో క్యాలరీలు తక్కువ. ఈ విషయం ఆనోటా ఈనోటా పాకి ఇవి అంతర్జాతీయ మార్కెట్లోకి వచ్చాయి. అసలే ఊబకాయంతో బాధపడుతున్న ప్రపంచ ప్రజల్ని ఈ జీరో క్యాలరీల నూడుల్స్, పాస్తాలూ బాగా ఆకర్షించాయి. అంతేనా ఈ పిండితో నూడుల్స్ చేయగా లేందీ బియ్యం ఎందుకు చేయకూడదు అనిపించింది. ఫలితమే..కొంజాక్ రైస్. దుంపల్ని ముందుగా పిండి పట్టించి ఆపై నీళ్లూ సున్నపుతేటను కలిపి పేస్టులా చేసి బియ్యం, స్పాగెట్టి, పాస్తా, సేమ్యా, మెకరోని, టార్టిల్లో..వంటివెన్నో తయారు చేస్తున్నారు. జిగురుతో పారదర్శకంగా ఉండే కొంజాక్ బియ్యం లేదా నూడుల్స్‌కి ఎలాంటి రుచీ ఉండదు. కానీ వీటికి పాలకూర, సోయా వంటివి జోడించి వండినప్పుడు వాటి రుచి వీటికి పడుతుంది. ఈ రైస్ రెడీ ఈట్ ప్యాకుల్లోనూ వస్తున్నాయి. ఇన్‌స్టంట్ నూడుల్స్ మాదిరిగానే క్షణాల్లో వండుకుని తినేయొచ్చన్నమాట. వీటినుంచి వచ్చే క్యాలరీలు దాదాపుగా జీరో. 100గ్రా. కొంజాక్ అన్నం తింటే దాన్నుంచి వచ్చేది కేవలం 10 క్యాలరీలు మాత్రమే. అదే వంద గ్రా.బంగాళాదుంపల్లో 360, వైట్‌రైస్‌లో 130, గోధుమ నూడుల్స్‌లో 368 క్యాలరీల చొప్పున ఉంటాయి. అయితే కొంజాక్ పిండిలో కలిపిన పదార్థాలను బట్టి క్యాలరీల సంఖ్య మారొచ్చు.

## ఆరోగ్యానికి మంచిదేనా?

కొంజాక్ దుంపలో గ్లూకోమనన్ అనే పీచు శాతమే ఎక్కువ. వంద గ్రా.పిండిలో 50గ్రా. పీచు, 1.64 గ్రా. ప్రొటీన్, కొద్దిపాళ్లలో కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, జింక్, మాంగనీస్, క్రోమియం, కాపర్ వంటి ఖనిజాలూ ఉంటాయి. ఈ పీచురక్తంలో కొలెస్ట్రాల్, గ్లూకోజ్ శాతాన్ని తగ్గిస్తుంది. పేగు కేన్సర్లనీ నిరోధిస్తుందట. దాంతో ఇటీవల ఇది మ్యాజిక్ ఫుడ్‌గా, ఆరోగ్యకరమైన ఆహారంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. కొంజాక్ రైస్ జిగురుగా ఉండటంతో నెమ్మదిగా జీర్ణమవుతుంది. దాంతో తిన్న వెంటనే పొట్ట నిండిన ఫీల్ కలుగుతుంది. ఇది ప్రి-బయోటిక్‌గానూ పనిచేస్తుంది. తద్వారా మంచి బ్యాక్టీరియా పెరిగేలా చేసి, రోగనిరోధకశక్తిని పెంచుతుంది. దీన్ని ఆహారంలో భాగంగా చేసుకోవడంవల్ల



కొలెస్ట్రాల్ పదిశాతం తగ్గిందనీ, బీపీ తగ్గిందనీ కొందరు చెబుతున్నారు. ఈ పీచు పొట్టలో జీర్ణమయ్యే దశలో చిన్న ఫ్యాటీ ఆమ్లాలుగా విడిపోతుంది. అవి పొట్ట నిండినట్లనిపించే హార్మోన్ విడుదలకు కారణమవుతాయి. అదేసమయంలో ఆకలిని కలిగించే గెర్లిన్ అనే హార్మోన్ విడుదలను తగ్గిస్తాయి. అందుకే ఈ రైస్ లేదా నూడుల్స్‌ను నాలుగు వారాలపాటు క్రమం తప్పక తీసుకుంటే ఆకలి హార్మోన్ విడుదల తగ్గి, కనీసం ఒకటిన్నర నుంచి రెండున్నర కిలోల బరువు తగ్గినట్లు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే పోషకాలన్నీ పుష్కలంగా ఉండే బ్రౌన్, బ్లాక్ రైస్ వంటి వాటికి కొంజాక్ ప్రత్యామ్నాయం కాదు. కానీ ఆకలి ఎక్కువగా ఉండేవాళ్లూ మధుమేహంతో బాధపడే ఊబకాయులూ కొంజాక్‌ను సలాడ్‌గానో లేదా ఒకపూట భోజనంలోనో తింటే ఫలితం ఉంటుంది అంటున్నారు నిపుణులు. ❑






# మనసైన జ్ఞాపకం

ఏదో ఒక చేప నా ఆకలి
వలలోకి జారిపడింది
వలను లాగాలనిపించలేదు
నది అలా ప్రవహిస్తుంది
వలసపక్షి వొకటి నదివొడ్డుకు
నా వంక అదోలా చూస్తుంది
పిల్లల నవ్వుల మధ్య నదిలో
కాగితపు పడవలు
ఊగిసలాడుతున్నాయి
సమ్మోహనమైన ప్రకృతి లయలో
మనసు తేలిపోతుంది
వలలో చేప కలలో కదిలినట్టు
వల నుండి నదిలోకి జారిపోయింది
నిశ్శబ్దమైన నది నా నుండి
లాలనగా ప్రవహిస్తుంది
సంధ్యా తీరమంతా ఓంకారమై
వేట నిషేధమంటుంది
చెమ్మగిల్లిన కళ్లతో మనసు
వెనక్కి పోయింది
నది నెమ్మదిగా నా నుండి
అలా ప్రవహిస్తూనే వుంది.

**- రవి మాగంటి**

---

# అక్షరాలే నా నేస్తాలు..




చిన్నతనంలో నేర్చుకున్న అక్షరాలు
నేడు నాకు ఉపాధిని చూపిస్తున్నాయి
పుస్తకాలన్నీ చుట్టూ పరుచుకుని
చదువుకున్న పాఠాలు
నాకు విజ్ఞాన వెలుగుల బాటల్ని
పరిచయం చేస్తున్నాయి.
నాడు మాస్టార్లు బోర్డులపై
రాసిన రాతలు
నా నుదిటి రాతల్ని తీర్చిదిద్దాయి
అక్షరాలను ప్రేమిస్తూ..
అక్షర పరిమళాలని హృదయమంతా నింపుకుంటూ
ఆనందంగా చదువుకుంటుంటే
నేటికీ నేను నిత్య విద్యార్థినే.
ఇప్పటికీ అక్షర మిత్రులు
తోడవుతూ నన్ను ముందుకే
ప్రగతి పథాన నడిపిస్తున్నారు.
అక్షరాలు ఆలంబనగా ఉన్న జీవితాలు
సదా స్ఫూర్తివంతములు.

**- గొర్రెపాటి శ్రీను**

## ఈవారం కవిత్వం

# ఆ ఇల్లు

ఎప్పుడూ సంతలా బతికిన
ఆ ఇల్లు/ సందడి లేక
బోసిపోయింది.
మౌనంతోనూ మాట్లాడిన
ఆ గూడు కళ తప్పింది
ముచ్చట్లాడేవాళ్లు కానరాక.
ఆత్మీయత అన్నం పంచిపెట్టిన
ఆ గుండె తడి ఇంకిపోయింది
ఇరుగు పొరుగు కవితల అనువాదం కరువై.
అవ్వ తాత అమ్మా నాన్నల ఊపిరి
ఆ గుండె పాట
ఏ రాగం పలకని వీణై మిగిలేను.
భావోద్వేగాల బంధమైన
మమతల కోవెల/ ప్రవహించని నదిలా బావురుమనె.
మనసుల తడిమిన జీవితం
ఆ వాకిలి/ నిర్జలమై నిర్జనమైంది మోడుబారి.
రుధిర స్వేదాలకు మరో పేరైన
అవని ఆత్మ
ఎగిరిపోయిన పక్షులగూటి చెట్టై.

**– డా॥ టి.రాధాకృష్ణమాచార్యులు**






## 'ఆధునిక కథలు కొత్త కోరికలు'

మానవ జీవనసారాన్ని ఒడిసిపట్టుకొని అద్భుతకథా గమనంతో కథలు పండించగల తాత్త్వికవేత్త రాములు. తెలంగాణ రాష్ట్రం ఉద్యమక్రమంలో రాయబడిన కథలివి. జీవితాన్ని తనకుతాను తరచి చూసుకోవడానికి, కొత్తజీవితం గెలుచుకోవడానికి, ఆధునిక జీవితానికి అవసరమైన కోరికలు, లక్ష్యాలు సాధించడానికి ఎప్పటి కప్పుడు కొత్తకోరికలతో సంకల్పబలంతో ముందుకు సాగడానికి ఈ కథలు దోహదం చేస్తాయి. 'కొత్తకోరికలు' కథలో 'సత్యం' పాత్రద్వారా సగటు మనిషి ఆలోచనలు.. అవసరాలు..ఎలా వుంటాయో అద్భుతంగా రచయిత అక్షరీకరించారు (పేజీ.11). ఇంటర్ చదివే సత్యం పెళ్లి చేసుకోదల చడం- డిగ్రీ అయ్యాక పెళ్లి-ఇల్ల కట్టుకోవడం, భార్య జానకిని చదివించడం, ఉద్యోగంలో చేర్పించడం ఇద్దరు పిల్లలు కలగడం, సత్యం చెల్లెలు శ్రావ్య కాలిఫోర్నియాలో ఉద్యోగం విదేశాలు చూడాలనే సత్యం కోరిక ఇలా ఈ కథ నడుస్తుంది. 'కొత్త జీవితం' కథలో సుగుణావతి, రాజ్యలక్ష్మి, వసుంధర పాత్రల్ని అద్భుతంగా రచయితమల్చారు. వసుంధర ఆంజనేయులు, పాఠకుల్ని కదిలి స్తాయి. 'ఓయు క్యాంపస్' కథలో రాజకీయపార్టీల నేతలు, కవులు, జర్నలిస్టులు 1975నాటి ఎమర్జెన్సీ రోజులు 1969-72 జైఆంధ్రా-జైతెలంగాణ ఉద్యమాలు, ఓయు క్యాంపస్ రూ.57. చక్కటి మానవీయ కుటుంబస్పర్శతో ఈ కథలు సాగుతాయి.

**(ఆధునిక కథలు కొత్తకోరికలు, రచన: బి.ఎస్.రాములు, వెల: రూ 150, ప్రతులకు: విశాలసాహితీ అకాడమీ, బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-13)** **– తంగిరాల చక్రవర్తి**



## మన ఆంధ్రప్రదేశ్

2014 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ వేరుపడిన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన విషయం మనకు తెలుసు. యిప్పుడు 26 జిల్లాలతో రూపొందిన విశాల ఆంధ్రప్రదేశ్ గొప్ప దనం శ్లాఘిస్తూ ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం 77కవితలతో 'మన ఆంధ్రప్రదేశ్' పేరిట ఓ కవితా సంకలనం వెలువరించింది. ప్రసిద్ధ కవులతోబాటు వర్ధిష్ణువులైన కవులు కూడా తమ కలాలను ఝళిపించారు. రాజమహేంద్రవరం, తెనాలి, విశాఖపట్నం, సింహాచలం, మచిలీపట్నం, అనంతపురం, అమరావతి, విజయ వాడ, చిత్తూరు, ప్రకాశం కోనసీమ, కృష్ణా, ప్రకాశం, చిత్తూరు, పశ్చిమగోదావరి, యిత్యాది నగరాలు, జిల్లాలకు చెందిన కవులు, కవయిత్రులు తమతమ ప్రదేశాల ప్రాశస్త్యను కీర్తిస్తూ కవితలు అల్లారు. నిజానికి వీరిలో చాలామంది హైదరాబాద్‌లో స్థిరబడిన వారే. పచ్చదనానికి ప్రాణవాయులైన రాజమహేంద్రవరం గురించి ఎస్.ఆర్.పృథ్వి, గర్తపురి పేరు గుంటూరుగా పేరొందిందని రమణ యశస్వి, నవ్యాంధ్రప్రదేశ్‌ను పడిలేచిన కెరటంగా అభివ ర్ణిస్తూ బండికల్లు జమదగ్ని, రాజధాని అమరావతి సమీపాన గల పొత్తూరు విశిష్టతను తెలియజేస్తూ పొత్తూరు సుబ్బారావు కవితల ల్లగా 'ఆంధ్రప్రదేశ్ నేడు-నాడు' పేరిట ఛందోబద్ధ పద్యాలను అం దించారు చావలి సుబ్రహ్మణ్యం. సంకలనం సంపాదకులు సోమే పల్లి వెంకట సుబ్బయ్య,చలపాక ప్రకాష్ అభినందనీయులు.

**(మన ఆంధ్రప్రదేశ్, రచన: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, వెల: రూ 150, ప్రతులకు: 5-11-57/1- 32, రజకవీధి, విజయవాడ-01)** **– రమణ వెలమకన్ని**

# పుస్తక సమీక్ష

మొత్తం 14 అనువాద కథలున్న పుస్తకం 'దయాహృదయ' అనువాదకుడు అమ్జద్. ఇందులో రచయిత అనువాదాలకు ఎంచుకున్న కథలన్నీ ఆసక్తికరమైనవి. కొసమెరుపుతో పాఠకుడిని ఒక్క కుదుపుకుదిపి, పెదవులపై చిరునవ్వు నిలపగలిగినవి. అనువాదం సరళంగా ఉంది. చదువుతుంటే పరభాష నుంచి అనువదించిన రచనల్లాగా

## చదివించే అనువాద కథలు




అనిపించవు. ఇందులోని 14 కథలున్నా 14 విభిన్నమైన రీతుల్లో అలరిస్తాయి. కానీ 'కళాకారుడు', 'సహనం', 'బంకర్' కథలని మనల్ని వెంటాడతాయి. తన కళ ప్రదర్శనకోసం మానవత్వం మరచిన కళాకారుడు 'కళాకారుడు' కథలో పరిచయమవుతాడు. తన ప్రాణాలని ప్రమాదం వాకిట్లో వున్నప్పుడు మనిషి ప్రదర్శించే తీవ్రమైన స్వార్థం 'బంకర్'లో కనిపిస్తుంది. అలాగే, నీతులు చెప్పటం మటుకే, ఆచరణలో కాదన్న సత్యాన్ని అత్యంత వ్యంగ్యంగా చూపిస్తుంది 'సహనం' కథ. ఇలా ప్రతి కథలో ఓ చమత్కారం, వ్యంగ్యం, ఆశ్చర్యం కలగలసి ఉండటంతో కథలన్నీ వేగవంతంగా చదివించటమే కాదు చదివిన తరువాత చాలా కాలం గుర్తుంటాయి. చక్కటి అనువాద కథల పుస్తకం ఇది.

**(దయాహృదయం (అనువాద కథలు), అనువాదం: అమ్జద్, వెల: రూ 100, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, సలీమ్‌నగర్, మలక్‌పేట, హైదరాబాద్-36)**

**– నిర్మోహి**

నేటి బాలలే రేపటి పౌరులు. బాలలు లేతకొమ్మవంటి వారు. వారిని చిన్నతనాన్నే మంచిదారులకు మరలించాల్సిన బాధ్యత వారి తలిదండ్రులపైన, తాతనాయనమ్మ, అమ్మమ్మలపైన ఉంది. మారుతున్న ఈ కాలంలో వ్యష్టికుటుంబాలే



## బాలల కథలు

ఎక్కువ కావటం, తలిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులై పిల్లల అభివృద్ధిపై దృష్టిపెట్టలేకపోవటం జరుగుతున్నది. ప్రస్తుత కాలానికి బాలసాహిత్యం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటు న్నది. ఎదిగిన పిల్లలకు సాహిత్యంపై ఆసక్తి కలుగచేసి మంచి మంచి నీతులు బోధిస్తూ వారిని బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దేం దుకు సాహిత్యం సాయపడుతున్నది. విశాల, వియోగిలు అంది స్తోన్న 'మాబామ్మ కథలు' 55 పిల్లల కథలున్నాయి. కమ్మగా పాడే కోకిలలు, మచ్చిక చేయబడిన గుర్రం గాడిదలున్నాయి. కుందేళ్ళు, పులులు, ఎలుగుబంట్లు ఉన్నాయి. కోతులు, ఎద్దులు, చేపపిల్లలు, రామచిలుకలు ఉన్నాయి. ఇవన్నీ ఈ కథాసంపుటి చదివే చిన్నారులకు కాలక్షేపానికై చెప్పేకథల్లో నీతి బోధలున్నాయి. రచయితలిద్దరూ తెలుగు సాహిత్యంలో ఆరితేరినవారు. వియోగి, తెలుగు సాహిత్యానికి చిరపరచితులు. పత్రికారంగంలోనిష్ణాతులు. ఇద్దరికీ అభినందనలు.

**(మా బామ్మ కథలు, రచన: విశాల, వియోగి, వెల: రూ250, ప్రతులకు: టి.కె.విశాలాక్షిదేవి, 87-468, శ్రీనగర్ కాలనీ, బి-క్యాంపు, కర్నూలు)** **– కూర చిదంబరం**



# బొబ్బిలి వీణ విశిష్టత

శ్రీసరస్వతీదేవికి అలంకార భూషితం... ఆ మహాజ్ఞాన ప్రసాదినికి విశ్వపరిపాలకుడు ఇచ్చిన పేటెంట్ హక్కు... సదరు వీణల తయారీలో విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రసిద్ధి గాంచడం విశేషం. వీరబొబ్బిలికి చరిత్రలో ఓ ప్రత్యేకపుట ఉన్నట్లే బొబ్బిలి వీణకు ఆ చరిత్రతో పెనవేసుకునే బంధమూ ఉంది. సంగీత ప్రియుల హృదయ తంత్రులను మీటడంలో బొబ్బిలి వీణకు సాటి మరిలేదనడంలో అతిశయోక్తి లేదు. ప్రముఖ వీణావా(నా)దకులు వాసా కృష్ణమూర్తి, ఈమని శంకరశాస్త్రి, చిట్టిబాబు, జోగులాంబ, పద్మిని, శ్రీవాణి ఇలా ఎంతో మంది వీణానాద కళాకారులు తమ ప్రతిభకు పదును పెట్టి పలువురు మన్ననలు అందుకున్నది కేవలం బొబ్బిలి వీణ మహత్మ్యంగా చెప్పుకుంటారు. రెండు శతాబ్దాల క్రితం నాటి బొబ్బిలి వీణల తయారీని 1959లో ప్రభుత్వం గుర్తించింది. అనేకమంది ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో బొబ్బిలిలో 1994లో దివంగత రాజా ఆర్‌విజికె రంగారావు సౌజన్యంతో తాత్కాలికంగా వీణల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. 2002లో మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లిలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ పరిధిలో హస్తకళలఅభివృద్ధి కేంద్రాన్ని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటుచేసారు. బొబ్బిలి, గొల్లపల్లి, వాడాడ గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాలకు చెందిన 200 మంది హస్త కళాకారులు బొబ్బిలి వీణలను తయారు చేయడంతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వడ్రంగం, కమ్మరం, దంతపు మెట్లు కట్టడం, సప్తస్వరాలను వీనులవిందుగా అందించే విధంగా తీగలను బిగించడం వంటి జాగ్రత్తలతో బొబ్బిలిలో వీణలను తయారు చేస్తారు. ఇలా తయారుచేయగలగడం ఇక్కడి వారి ప్రత్యేకత. పనస చెట్టునుంచి సేకరించిన కలపతో అతుకులు లేకుండా ఏకండి కర్రతో తయారు కావడమే బొబ్బిలి వీణ ప్రత్యేకత. ఇత్తడి లేక కంచుతో మెట్టు తయారుచేసి ఇత్తడి కర్రతో కుటీలు అమర్చి సుస్వరాలు పలికించడానికి కళాకారులకు కాస్త రాగ జ్ఞానం కూడా అవసరమని చెప్పవచ్చు. బొబ్బిలి వీణంటే వాయిద్యకారులకు ఎంతో మక్కువ. నూజివీడు, పిఠాపురం, తంజావూరు, మైసూరులలో వీణలు తయారవుతున్నప్పటికీ, బొబ్బిలి వీణ ప్రత్యేకత చెక్కుచెదరకపోవడం గమనార్హం. నేటి ఆధునిక సమాజంలో పాశ్చాత్య సంగీతవాయిద్యపరికరాల పట వాటి సంగీతం పట్ల ప్రజలకు మోజు ఉన్నప్పటికి, అగ్రహీరోలు నటించే సినిమాల్లో వీణల పాటలకు ఇటీవల పెద్ద ఎత్తున ఆదరణ లభించడం గమనార్హం. సంగీత పరిజ్ఞానం లేనివారు సైతం తమ ఇళ్లల్లో గిఫ్ట్‌వీణలను అలంకారంగా పెట్టుకునేందుకు మోజు చూపుతుండడంతో బొబ్బిలి వీణలకు మార్కెట్‌లో గిరాకీ ఉంది. రాష్ట్ర గవర్నర్ అధికారిక నివాసమైన రాజ్‌భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమాలకు విచ్చేసే అతిధులకు బొబ్బిలి గిఫ్ట్ వీణలను బహూకరించాలని అధికారికంగా నిర్ణయించడం విశేషం. పలు దపాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే హస్తకళల ప్రదర్శనలకు బొబ్బిలి వీణలు కూడా వెళ్లి, తమ బొబ్బిలి రాజసాన్ని, ప్రత్యేకతను చాటుకున్నాయి.



అమెరికా అధ్యక్షుని హోదాలో బిల్ క్లింటన్ రాష్ట్రానికి విచ్చేసినప్పుడు బొబ్బిలి వీణను చూసి అబ్బురపడి, వీణ తయారీ కళాకారుని అమెరికా రావాలని సాదరంగా ఆహ్వానించారు. అధికారుల సమన్వయం లోపం కారణంగా ఈ సదవకాశాన్ని పదేళ్ల క్రితం వినియోగించుకోలేకపోయారు. బొబ్బిలి వీణల తయారీ కేంద్రం ఇన్‌చార్జి సర్వసిద్ధి అచ్యుతనారాయణ, కళాకారుడు సర్వసిద్ధి రామసుధాకర్ ఇలా వివరిస్తున్నారు.

వీణల తయారీకి అవసరమయ్యే పనస చెట్టు కలపను మక్కువ, తాళ్లబురిడి ప్రాంతాలనుంచి కొనుగోలు



చేస్తున్నామన్నారు. పనస కలపను తమకు అధికారికంగా సరఫరా చేస్తామని, పనసచెట్ల పెంపకానికి భూమిని ప్రత్యేకంగా కేటాయిస్తామని నాయకులు, అధికారులు ఇచ్చిన హామీలు నీటమూటలయ్యాయి కేంద్ర బృందం వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి జిల్లా కలెక్టరు వంద ఎకరాల భూమిని పనస చెట్ల పెంపకానికి కేటాయిస్తామని చెప్పినా అది అమలులోకి రాలేదు, అలాగే అటవీశాఖ ద్వారా ప్రత్యేక డిపో ఏర్పాటుచేస్తామన్న హామీని అధికారుల నిలబెట్టుకోలేదు. సాదా వీణల కన్నా గిఫ్ట్ వీణలకే ఎక్కువగా డిమాండ్ ఉండడంతో వాటి తయారీలో నిమగ్నమయ్యాం. ఆర్డరుపై పెద్ద వీణలను తయారు చేస్తున్నాం. పెద్ద వీణలు 12 వేల నుంచి 15 వేల రూపాయల విలువ దాకా ఉన్నాయి. నెలకు ఒకటి లేదా రెండు ప్రొఫెషనల్ వీణలు మాత్రమే అమ్ముడవుతున్నాయి. 9 అంగుళాల గిఫ్ట్ వీణలు, 17 అంగుళాల నెమలి ఆకారపు వీణ తయారు చేస్తున్నాం వారు పేర్కొన్నారు. గిఫ్ట్ వీణల్లో మొత్తం 9 రకాలు ఉన్నాయి. ప్లెయిన్, నెమలి, సితార్, తంబుర, స్వర మండలి, వయోలిన్, తబలా సెట్, డోలు-సన్నాయి, ఫ్లూట్ వీణల ఆకారంలో వీణలను తయారు చేస్తున్నాం. వారానికి ఒక్కో కళాకారుడు 5 నుంచి 6 వీణలను తయారు చేయగలుగుతాడు. సాదా వీణ తయారీకి పది నుంచి 15 రోజులు పడుతుంది. 15 మంది నిపుణులైన కళాకారులు ఉన్నారు. వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. వీణల తయారీలో మహిళా కార్మికులు కూడా ఉండడం గమనార్హం. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన బొబ్బిలి వీణకు మేథోసంపత్తి హక్కులు (పేటెంట్) మంజూరు చేయాలని, చెన్నైలోని జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సానుకూల స్పందన లభించడంతో, ఇందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు స్థానిక వీణల కేంద్రం చేతికందాయి. పేటెంట్ హక్కుతో బొబ్బిలి వీణ మరింత ప్రాచుర్యం పొందినట్టయింది.

### వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ అవార్డుకు నామినేట్ అయిన బొబ్బిలి వీణను పరిశీలించిన బృందం

బొబ్బిలి వీణ ఒన్‌డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ క్రింద బొబ్బిలి వీణ అవార్డుకు నామినేట్ అయినందున ఇన్వెస్ట్ ఇండియా టీం వెరిఫికేషన్ కోసం ఇటీవల బొబ్బిలిలోని గొల్లపల్లి గ్రామంలో పర్యటించారు. వీణలుతయారు చేయు హస్తకళాకారులతో జే.సి మయూర్ ఆశోక్, కేంద్రబృంద సభ్యులు రవిన్ చరియన్, సమీర ముఖాముఖీ చర్చించారు. వీణలు తయారీవలన ఎంత ఆదాయం చేకూరుతుందని ఉపాధి ఎలా ఉందని కళాకారులను ప్రశ్నించారు. హస్తకళాశాకారుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ వీణల తయారీకు పనస ఏకర్రను వినియోగిస్తామని అన్నారు. పెద్దవీణ తయారీకి ఒక నెల రోజులు పడుతుందని అన్నారు. లక్కతోపాలిషింగ్ చేస్తామన్నారు. 15వేల రూపాయలవరకు వస్తుందని అన్నారు. చిన్న వీణ తయారు చేస్తే 10వేల రూపాయిలు వరకు వస్తుందని అన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని అలా నిలబెడుతున్నామని అన్నారు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందజేస్తే రానున్న తరాలకు మార్గదర్శిగా ఉంటామని అన్నారు.

### జిల్లా కలెక్టర్‌తో కేంద్ర బృందం సమావేశం

జిల్లాకలెక్టర్‌తో బొబ్బిలి వీణ తయారు పనితనం గురించి వచ్చిన కేంద్రబృందం తో కలెక్టర్ నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు. బొబ్బిలి వీణ స్థానిక



సాంప్రదాయ కళగా మిగిలిపోకుండా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ జరిగేలా చూస్తామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. అందకోసం హస్తకళాశాకారులకు అవసరమయ్యే సాంకేతిక నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రోత్స హిస్తామని పేర్కొన్నారు. బొబ్బిలి వీణ వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్‌క్రింద ఆవార్డుకు నామినేట్‌అయిన సందర్భంగా కలిసిన అనంతరం ఇటీవల



కేంద్రబృందం జిల్లా కలెక్టర్ తన చాంబరులో కలిసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వీణలతయారు చేసే కళాకారులకు కావలసిన మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకొంటామన్నారు. జాతీయ స్థాయిలో జియోగ్రాఫికల్ ఇండెక్స్‌తో అనుసంధానం చేయడం జరుగుతుందని అన్నారు. వీరితో కేంద్రబృందం సభ్యులు రాబిన్ చరియన్, చేనేత అధికారి మురళీకృష్ణా, అభివృద్ధి అధికారి వసంత జిల్లా పర్యాటక అధికారి వారితో ఉన్నారు. ప్రస్తుత వీణా కేంద్రం నిర్వాహకుడు ఎస్. రామకృష్ణ ఈకేంద్రం తమ పూర్వీకుల నుంచి వచ్చిందని ప్రస్తుతం వీణాతయారీ కేంద్రాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కలప, మార్కెటింగులో ప్రభుత్వ చొరవ తీసుకొని కళాకారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

**- కొండ్రవీడి ఆచారి అదినారాయణ**
విజయనగరం జిల్లా రిపోర్టర్

కథ

# భయం వద్దు

**ముందే** చందూకి భయం ఎక్కువ. నాన్నంటే భయం, పక్కింటాయనంటే భయం, టీచర్లంటే భయం, దెయ్యమంటే భయం. ఇన్ని భయాలనడుమ బాల్యం గడుపుతూ వస్తున్నాడు.

కానీ చందుకి కొన్ని ఇష్టాలు కూడా ఉన్నాయి. అవి ఆటలు, పాటలు, తోటలో వున్న మొక్కలు. సినిమాలు షికార్లు.

ఆరోజు ఆదివారం కావడం వల్ల ఆటలతో గడిపేసాడు. ఆ మరుసటిరోజు ఉదయం 'అమ్మా నేనీరోజు బడికెళ్లను' అని అన్నాడు.



చందు వాళ్లమ్మకు వాడి భయాలు, ఇష్టాలు అన్నీ తెలుసు. 'నువ్వు హోంవర్క్ చేయలేదు. అందుకే కదూ బడికెళ్లనంటున్నావు'? అందామె. అందుకు మౌనంగా ఉండిపోయాడు చందు.

'చందూ! భయం వద్దు. హోంవర్క్ చేయలేదని చెప్పు, పర్వాలేదు. కాదుపోదు అంటే ఒక్క దెబ్బవేస్తారు. ఆ దెబ్బతో ఇకపై హోంవర్క్ చేయడం మర్చిపోవు. అదొక గుణపాఠంగా గుర్తుంటుంది' అంది అమ్మ కమలమ్మ.

'అమ్మా! నాకు చాలా భయంగా ఉందమ్మా!!' అని సణగడం మొదలెట్టాడు చందు.

'చందూ! నాతోరారా! భయం లేనివారిని చూపిస్తాను' అంది అమ్మ. చందు అమ్మను అనుసరించాడు.

మొదట ఇంటిముందు ఉన్న చీమలగుంపును చూపించింది అమ్మ. 'మనకంటే లక్షవంతున్న ఈ చిట్టి చీమల్ని చూడు. ఇవి సింహానికి సైతం భయపడవు. ఇంటి తోట దగ్గర ఆగింది. జామచెట్టుపై చిలకలను తోలింది. అవి అలా ఎగిరి మళ్లీ చెట్టుని చేరి కాయలు కొరికి తింటున్నాయి.

ఇంటిగోడపై వాలి కావ్‌కావ్ అని అరుస్తున్న కాకుల్ని తోలింది. కానీ అవి భయపడలేదు.

రెండు ఉడుతలు ఒకదాని వెంట ఒకటి పరుగులు తీస్తూ ఆడుకుంటున్నాయి. వాటిని వుష్..వుష్ అని బెదిరించినా భయపడలేదు.

పువ్వుల మొక్కలపై సీతాకోకచిలుకలు తిరిగి ఆనందంగా వున్నాయి. మొక్కని కదిలించింది అమ్మ. అవి బెదరలేదు, భయపడి పారిపోలేదు.

తమ పెంపుడు కుక్కపిల్లలు కుయ్‌కుయ్‌మని అరుస్తూ తమతోనే వున్నాయి. అమ్మ కమ్మలమ్మ 'చీచీ ఎదవకుక్కలు పోమ్మన్నా పోవు కదా!' అని వాటివీపుపై చెరొక దెబ్బ వేసింది. అవి ఆ క్షణం కుయ్యోమంటూ వెళ్లి మళ్లీ కమ్మలమ్మ కాళ్లే నాకుతున్నాయి.

'చందూ! ఇప్పుడు చెప్పు. చీమలు చిలకలు కాకులూ ఉడతలు, కుక్కలూ, సీతాకోకచిలుకలు భయపడ్డాయా? ఈ చిన్నప్రాణులకు లేని భయం నీకెందుకు?' అని అడిగింది అమ్మ.


'అమ్మా! నాకిప్పుడు భయం లేదు. నేను బడికి వెళ్లిపోతానమ్మా!' అన్నాడు చందు.

**- యల్.రాజా గణేష్**



## బాలగేయం

### ముద్దులొలికే పిల్లలు



జగతిలోని వెలుగులు
పాలకడలి తరగలు
ముద్దులొలికే పిల్లలు
తెల్లని సిరిమల్లెలు

రంగుల హరివిల్లులు
సొగసుల విరిజల్లులు
ముద్దులొలికే పిల్లలు
దేశానికి ఎల్లలు

ప్రశాంతమైన పల్లెలు
జీవజలపు ఊటలు
పసిపిల్లల మాటలు
జుంటితేనె ధారలు

అభివృద్ధికి బాటలు
అపురూపం బాలలు
పసి పిల్లలు వేల్పులు
ఇంట ఉన్న శుభములు

– గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- బి.భాస్కర్,** వేములవాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. విమానాలను పక్షులు ఢీకొనే అవకాశముందని ప్రయాణాలను అర్ధాంతరంగా ఆపివేస్తుంటారు. ప్రమాదం జరిగే అవకాశం ఎలా ఉంది?

**జవాబు: భాస్కర్ !** ఇలాంటి ప్రమాదం ఎక్కువగా విమానాశ్రయాల దరిదాపుల్లోనే ఉంటుంది. అనుకోని రీతిలో విమానాలను పక్షులు ఢీకొంటే విమానాల ఇంజన్‌లు పాడైపోయే పరిస్థితి వస్తుంది. ప్రొపెల్లర్‌కి పక్షి ఢీకొని, ప్రొపెల్లర్‌లోకి దూసుకు పోయినట్లయితే దాని శరీర భాగాలు ఇంజన్‌లోకి వెళ్లిపోతాయి. తత్ఫలితంగా ఇంజన్ భాగాలు జామ్ అవుతాయి. విమానం కూడా ఆగిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఎక్కువ శాతం ఈ తరహా ఘటనలు విమానాలు విమానాశ్రయాల్లో టేకాఫ్ అయ్యే ముందు సంభవించే అవకాశం ఉంది. అందువల్ల విమానాశ్రయం పరిసర ప్రాంతాలలో పక్షులు లేకుండా చూస్తారు. అవి పారిపోవడానికి తగిన ప్రయత్నాలు చేస్తారు.

**- ఎస్.శంతన్,** వరంగల్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. హామ్ రేడియో అంటుంటారు..'హామ్' అంటే వివరించగలరు..?

**జవాబు: శంతన్!** ప్రపంచంలో హామ్ రేడియో వ్యవస్థకు 18వ శతాబ్దంలోనే బీజాలు పడినా, 1923లోనే సమగ్రంగా రూపొందింది. దీనిని ఎమెచ్యూర్ రేడియోగానే వ్యవహరించేవారు. 1969, జూన్‌లో ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రమండలంలో అడుగు పెట్టిన తర్వాత దీనిని హామ్‌గా పేరు మార్చారు. సమాచార ప్రసార వ్యవస్థలకు ఆద్యులైన మహనీయులు హెడ్జ్(విద్యుత్ తరంగాలను కనుగొన్నవారు), ఆర్మ్‌స్ట్రాంగ్ (చంద్రమండలం మీద కాలు పెట్టిన తొలి మానవుడుగా ప్రచారంలోకి వచ్చినవారు), మార్కొని (రేడియో కనుగొన్నవారు) ఈ ముగ్గురి పేర్లలోని మొదటిఅక్షరాలే 'హామ్'గా రూపొందాయి. 'ప్రపంచ ఎమెచ్యూర్ రేడియో దినోత్సవం' ప్రతి ఏటా ఏప్రిల్ 18జరుపుతారు.

# అణుశక్తి పితామహుడు హోమీబాబా



**డాక్టర్ దేవులపల్లి పద్మజ**

భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్తల జాబితాలో ప్రథములు జహంగీర్ బాబా, మెహరానా దంపతులకు హోమీ జహంగీర్ బాబా 30 అక్టోబర్ 1909నాడు ముంబైలో జన్మించారు. చిన్నతనం నుండి హోమీబాబా నిశితమైన బుద్ధితో నిరంతరం విద్యపై దృష్టి కలిగి ఉండేవారు. అతని ఆలోచనా స్రవంతిని, బుద్ధి కుశలతను గమనించిన తల్లిదండ్రులు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన అనేక గ్రంథాలను సమకూర్చారు. పుస్తకాలే తన స్నేహితులుగా ఊహించుకుంటూ విజ్ఞాన సముపార్జనలో మునిగిపోయే వారు హోమీబాబా. సహజంగా పిల్లలకు ఉండే ఆటలపై ధ్యాస బాబాకు ఉండేదికాదు. ప్రఖ్యాత విజ్ఞానశాస్త్రవేత్త అయిన ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని చిరుప్రాయంలోనే సులువుగా ఆకళింపు చేసుకుని అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. పాఠశాలలో బాల మేధావిగా గుర్తింపు పొందిన బాబా అనేక పురస్కారాలు, స్కాలర్‌షిప్పులు పొందారు. బాబా ప్రాథమిక విద్యాభ్యాసం కేథడ్రల్, జాన్‌కన్నన్, హైస్కూల్‌లోను, కేంబ్రిడ్జ్ పరీక్షా ఉత్తీర్ణతతో ముంబై ఎలిఫిన్‌స్టన్ కాలేజీ రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సాగింది. బాబా చిన్నతనం నుండి భౌతిక శాస్త్రంలోను, గణితంలోను ఎక్కువగా మక్కువ కలిగి ఉండేవారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుండి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. బాబా 1937లో ప్రసిద్ధశాస్త్రవేత్త అయిన హైట్లర్‌లో కలిసి 'క్యాస్కెడ్ థియరీ ఆఫ్ ఇన్‌ట్రాన్ శావర్స్'ను ప్రతిపాదించారు. దీనినే 'బాబా హైట్లిర్ కాస్కెడ్ థియరీ'గా గుర్తింపు వచ్చింది. ఈ సిద్ధాంతం కాస్మిక్ కిరణాలలో ఎలక్ట్రానిక్ కణాలను శోధించారు. వీటికి ఆయన 'మేసన్' అని నామకరణం చేశారు. కాస్మిక్ వికరణానికి సంబంధించిన 'థియరీ ఆఫ్ ఎలిమెంటరీ పార్టికల్స్', క్వాంటమ్ థియరీ' 'క్లాసిక్ థయరీ ఆఫ్ స్పిన్నింగా పార్టికల్స్' పరిశోధనా కార్యకలాపాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయి. రెండవ ప్రపంచ యుద్ధసమయంలో బాబా స్వదేశానికి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. 1940వ సంవత్సరంలో భారతీయ విజ్ఞాన సంస్థలో రీడర్‌గా వృత్తిని చేపట్టి 1942వ సంవత్సరంలో ప్రొఫెసర్‌గా పదోన్నతిని పొందారు. కాస్మిక్ కిరణాల పరిశోధన కోసం ప్రత్యేక విభాగాన్ని కూడా ప్రారంభించారు. శాస్త్రవిజ్ఞానమే భారతదేశ వికాసానికి మార్గమని దృఢంగా విశ్వసించేవారు. అణుభౌతిక శాస్త్ర అధ్యయనంలో తగిన వసతులు భారతదేశంలో లేనప్పటికీ అధైర్యపడక, వాటిని స్వయంగా సమకూర్చుకునే విధానాలను ఆలోచించేవారు. ఏనాటికైనా భారతదేశం అణు ఉత్పాదనలో స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుందని విశ్వసించేవారు. టాటా ట్రస్టువారు 1945 సంవత్సరంలో 'టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చి' అనే సంస్థని ప్రారంభించారు. ఈ సంస్థకు బాబా మొదటి డైరెక్టరుగా నియమితులైనారు. ఈ సంస్థలో శుద్ధగణితం, ప్రాయోజిక, సైద్ధాంతిక భౌతికశాస్త్రం, కంప్యూటర్, సాంకేతిక భూభౌతిక అధ్యయనం ప్రారంభించబడినాయి. అంతేకాకుండా అణువిస్ఫోటన సిద్ధాంతం, ఐసోటోపుల నిర్మాణం, యురేనియం శుద్ధిలాంటి విషయాలపైన కూడా అధ్యయనం సాగించేవారు. హోమీబాబా నేతృత్వంలోని టాటా ఇనిస్టిట్యూట్ అగ్రరాజ్యంలోని పరిశోధనా కేంద్రాలతో ధీటుగా ఉండేది. 1948 సంవత్సరంలో మనదేశంలో అణుశక్తి సంఘం స్థాపించబడినది. దీనికి కూడా బాబా మొదటి అధ్యక్షుడైనారు. 1954వ సంవత్సరంలో భారత ప్రభుత్వం అణుశక్తికి ఓ ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించింది. దానికి సంస్థాపక అధ్యక్షునిగా బాబాని నియమించారు. పారిశ్రామికవేత్త అయిన జెఆర్‌డి టాటా, భారత ప్రధానమంత్రి జవర్‌లాల్‌నెహ్రూతో గల సన్నిహిత సంబంధాల వలన పాలనా సంబంధమైన అనేక అడ్డంకులు అధిగమించి విజ్ఞానరంగంలో విశేష ప్రగతిని సాధించటానికి దోహపడినది. బాబా చొరవతో కెనడా సహాయంతో భారతదేశం అణురియాక్టర్ల నిర్మాణం చేపట్టింది. అణురియాక్టర్ల నిర్మాణం తరువాత బాబా తారాపూర్‌లో అణుశక్తి విద్యుత్ యాంత్రీకరణను చేపట్టారు. తరిగిపోతున్న జల, బొగ్గు, నూనె నిక్షేపాలు భారత ప్రగతి అవరోధాలుగా మారుతాయని బాబా ఎంతో దూరదృష్టితో ఆలోచించి అణువిద్యుత్తువైపు మొగ్గు చూపారు. ఈ అణువిద్యుత్తు ఉత్పాదనారంగంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టింది. త్వరగా చెడిపోయే ఖాద్యపదార్థాలమీద వికరణ ప్రభావాన్ని ఉపయోగించి జీవకణాలను రక్షించే పరిశోధనల వలన చేపలు, పండ్లు, వనస్పతి మొదలైన పదార్థాలను సురక్షితంగా ఉంచేందుకు

ఎంతగానో దోహదం చేస్తున్నాయి. ఈ ప్రయోగాలు, నిర్మాణాల ఫలితంగా నేడు ట్రాంబేలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు తయారవుతున్నాయి. దేశంలోని అనేక వైజ్ఞానిక సంస్థలకు బాబా తన విజ్ఞాన సహాయం చేశారు. విదేశాలలో స్థిరపడిన అనేకమంది శాస్త్రవేత్తలను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చి వారందరిని బాధ్యతాయుతమైన పదవులలో నియమించి చక్కటి వైజ్ఞానిక వాతావరణాన్ని తయారు చేయటంలో ఎంతో కృషి చేశారు. హోమీబాబా కృషి ఫలితంగా 1974వ సంవత్సరంలో భారతదేశం మొదటి అణువిస్ఫోటనం చేసి ప్రపంచంలో ఆరవ అణుశక్తి దేశంగా అవతరించింది. హోమీబాబాకు ఎన్నో సన్మానాలు, సత్కారాలు తమంతట తాముగా వరించాయి. దేశ, విదేశాలలోని అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశాయి. 1954వ సంవత్సరంలో భారత ప్రభుత్వం బాబాకు పద్మవిభూషన్ బిరుదును ఇచ్చి సత్కరించింది. యునైటెడ్ నేషన్స్, ఇతర





అంతర్జాతీయ అణుశక్తి సంస్థలలో బాబా సలహాదారునిగా పనిచేశారు. దేశ, విదేశాలలోని యువశాస్త్రవేత్తలను ఆహ్వానించింది వారికోసం శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేవారు. భారతకేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా చేరుటకు వచ్చిన ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించి, విజ్ఞానశాస్త్ర సముపార్జనకే తన జీవితకాలం వెచ్చించారు. తన ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేసారు. బాబా చిత్రకళ, శాస్త్రీయ సంగీతం, నృత్యం, శిల్పకళలను ప్రవృత్తిగా మలచుకుని అనేక సృజనాత్మక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనేవారు. బాబా చిత్రీకరించిన అనేక కళాకృతులు నేటికీ ఇంగ్లాండు చిత్రకళా సంగ్రహాలయంలో ఉన్నాయి. చెట్లను, పూలను ఎంతో ప్రేమించేవారు. అంతరించిపోతున్న అనేక వృక్షజాతులను స్వయంగా నాటి, వాటిని సంరక్షించారు. హోమీబాబా జీవిత పర్యంతం బ్రహ్మచారిగా ఉన్నారు. 'జీవితంలో చావును తప్ప అన్ని విషయాలను మనం శాసించగలం' అని అనేక పర్యాయాలు చెప్పేవారు. ఎవరైనా చనిపోతే పనిని ఆపేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవారు. 1966 సంవత్సరంలో జనవరి 14వ తేదీన బాబా తన శాంతి బృందంతో ఓ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు బోయింగ్ 707 కాంచనజంగా అనే విమానంలో ప్రయాణిస్తుండగా ఊహించని మంచుతుపాను ఢీకొట్టడంతో పరమాత్మలో ఐక్యమయ్యారు. ఆయన సిద్ధాంతాలకు, ఆశయాలకు అనుగుణంగా బాబా అనుచరులు, కింది ఉద్యోగులు పనిలో లీనమైన తమ శ్రద్ధాంజలి ఘటించారు. ట్రాంబే సంస్థకు 'బాబా అణుశక్తి ప్రతిష్టాన్'గా 1967వ సంవత్సరం జనవరి 12న నామకరణం చేయటం ద్వారా ఆయన పరిశోధనలకు తగిన గుర్తింపు ఇచ్చినట్లు అయ్యింది. హోమీబాబా కృషివలనే భారతదేశం ఎద్దులబండి యుగం నుండి నేటి అణుశక్తిరంగంలోనికి ప్రవేశించినదని నిర్వివాదంగా చెప్పవచ్చును. శాస్త్రజ్ఞునిగా, పరిపాలనాదక్షునిగా, దేశ ప్రజల మన్ననలను అందుకున్న బాబా సృజనాత్మకశక్తి అపూర్వం, అనిర్వచనీయం. తన జీవిత పర్యంతం దేశ ప్రగతికోసం శ్రమించిన హోమీబాబా చిరంజీవి, చిరస్మరణీయుడు. నిస్వార్థ దేశభక్తుల జాబితా చాలా చిన్నది. అందులో శాశ్వతమైన స్థానం పొంది భారతీయుల హృదయాల్లో స్థిరమైన స్థానం సంపాదించుకున్న హోమీబాబాకి ప్రణమిల్లుతూ... ❑


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త,** నం.396,

లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

కథ

# తలచనిదే జరిగినదా..!

గంగాధర్ వడ్లమన్నాటి

లిఫ్ట్ రెండవ ఫ్లోర్‌లో ఆగీ ఆగగానే గబ గబా బయటికి నడిచి వచ్చేసాడు. తర్వాత భార్య చేతిలోని సున్నుండల డబ్బా తీసుకుని, ముందుకు నడిచాడు. ఫ్లాట్ నంబర్ డెబ్భై ఏడు దగ్గరకి వచ్చాడు.

చుట్టూ చూసి, మనీ ప్లాంట్‌లో ఉన్న తాళంచెవిని చేతిలోకి తీసుకుని తన భార్యకి అందించాడు.

ఆమె తలుపు తెరిచింది. ఫ్యాన్ వేసుకుని ఇద్దరూ సోఫాలో కూలబడ్డారు.

తరువాత సుబ్బారావ్ జేబులో ఉన్న సెల్‌ఫోన్ తీసి కొడుకు నంబర్‌కి డయల్ చేశాడు. ఎత్తీ ఎత్తగానే "ఒరేయ్ మధూ, మేం ఇప్పుడే ఫ్లాట్‌కి వచ్చాం. మీ అమ్మ నిన్ను మధ్యాహ్నం నుండి ఆఫీసుకి హాఫ్ డే సెలవు పెట్టి రమ్మంటోంది" చెప్పాడాయన.

"మీరుంటే అలానే వచ్చేస్తాను నాన్నా, సరిగ్గా ఇవాళే నాకు క్లయింట్ మీటింగ్ వచ్చి పడింది. లేదంటే హాఫ్‌డే ఏమిటీ.. ఫుల్ డే సెలవు పెట్టేసి ఇంట్లో ఉండి మీతో టైమ్ మొత్తం స్పెండ్ చేసేవాణ్ని. నేను వచ్చినా రాకపోయినా లలిత అదే మీ కోడలు మాత్రం మధ్యాహ్నమే వస్తుంది. మీకేం కావాలన్నా అడిగి చేయించుకోండి" చెప్పాడు మధు.

"ఆ అమ్మాయితోనా! వద్దురా, హఠాత్తుగా నాకు ఎడం కన్ను అదురుతోంది" అని ఓ క్షణం ఆగి ఆ కన్ను మీద చేయి పెట్టి సుతారంగా రుద్దుకుంటూ "అయినా నువ్వు వచ్చి తగలడరా నాయనా అంటే కోడలిని పంపుతున్నావా" బెరిపోతూ అడిగాడాయన.

"నువ్వు ఊరికినే అలా భయపడిపోకు నాన్నా. తను ఇదివరకులా కాదు, ఎంతో మారిపోయింది. అత్తయ్య ఎప్పుడొస్తారు? అని అడిగింది కూడా. మిమ్మల్ని చూస్తే ఎగిరి గంతేస్తుంది తెలుసా".

ఆ మాట వింటూనే కాస్త కంగారుగా "అయ్యో అలాంటివి చేయొద్దని చెప్పరా. అసలే అమ్మాయి ఒట్టి మనిషి కాదు" చెప్పాడు సుబ్బారావ్.

"సరే, జోకులు మాని డైనింగ్ టేబిల్ మీద టిఫిన్ ఉంది. నువ్వూ అమ్మా పెట్టుకుని తినండి" చెప్పి ఫోన్ పెట్టేసాడు.

"వాడు చెప్పేది చెప్పడమే కానీ నేను చెప్పేది వాడు ఎప్పుడు విన్నాడనీ" అంటూ నసిగి ఫోన్ సోఫా మీద పడేసాడు.

కొద్దిసేపటికి సుబ్బారావ్ గారి కోడలు రానే వచ్చింది. వచ్చీ రాగానే "హాయ్ మామా, హౌ ఆర్ యు ఆంటీ" అంది ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంటూ.

కోడలి పలకరింపుతో కాస్త భయంగా తన భార్య జగదాంబ వైపు చూసి, చిన్న స్వరంతో "అపార్థం చేసుకోకు జగదాంబా. ఈ కాలం పిల్లలు అంతే, కొంచెం ఫ్రీగా, ఫ్రెండ్లీగా ఉంటారు" అని చెవిలో నసిగి "నేను ఫైన్ అమ్మా, మీ అత్తయ్య కూడా బాగానే ఉంది" చెప్పాడు.

"అవును మామా, అత్తయ్యని చూస్తేనే తెలుస్తోంది. అప్పటికంటే కొంచెం లావయ్యారు" చెప్పింది నవ్వుతూ.

ఆమె మాటలకి జగదాంబ "నన్ను అంత మాట అంటావా" అని లోలోనే నలిగిపోయి "ఏవిటమ్మా ఆ జీన్సు, షర్టు, నెత్తిన ఆ టోపీ కూడానూ. గబుక్కున చూసి గ్యాస్ బండలు వేసే అబ్బాయేమో అనుకున్నాను" చెప్పింది చిన్నగా నవ్వుతూ.

ఆమె మాటలకి కాస్త పళ్లు కొరికి "ఏంటి మామా, అత్తయ్యకి కంటిచూపు తగ్గిపోయినట్టుంది. ఆ కళ్లద్దాలు మార్చమని మీరైనా చెప్పాలి కదా" అంది.

సుబ్బారావ్ ఏదో చెప్పేలోపే- జగదాంబ అందుకుని "అయ్యో వద్దమ్మా, ఈ కళ్లజోడుతో చూస్తేనే నీ వాలకం ఇలా అనిపించింది. ఇంకా స్పష్టంగా నిన్ను ఆ బట్టల్లో చూస్తే నేను నవ్వు ఆపుకోలేకపోవచ్చు" చెప్పింది చిన్నగా నవ్వుతూ.

"ఆ.. ఆ.. సరే సరే, అత్తా కోడళ్లు ఇద్దరూ భలే తమాషా మాటల్లో మునిగిపోయారు కానీ ముందు ఆ వంట కార్యక్రమం మొదలుపెట్టమ్మా. ఇందాక తిన్న ఇడ్లీలు పొట్టలో ఓ మూలకి కూడా రాలేదు. పైగా నువ్వు వంట చేస్తావని మా మధు ఎప్పుడూ చెప్తూనే ఉంటాడు" చెప్పాడు సుబ్బారావ్.

"ఈ పూట భోజనం కాస్త ఆలస్యమైనా పర్వాలేదు. కానీ గుత్తి వంకాయ కూరతో పాటు కొంచెం పప్పుచారు కూడా చెయ్యమ్మా. అదే చేత్తో అప్పడాలు వేయించి, మజ్జిగ పులుసు చేసేయి" చెప్పింది జగదాంబ కొరకొరా చూస్తూ.

"అయ్యో, ఇంట్లో వంకాయలు లేవే, ఇక్కడికి కాయగూరల కొట్టు కూడా దూరమే. పర్వాలేదు అత్తయ్యా, రేపు తోపుడు బండి మీద కాయగూరలమ్మేవాడు వస్తాడు. కనుక గుత్తి వంకాయ కూర రేపు చేస్తానులెండి. ఇవాల్టికి..." అని ఏదో అనేంతలో-



"అదేవిటమ్మా, ఇందాక నీళ్ల కోసం అని ఫ్రిడ్జ్ తెరిచినప్పుడు నల్ల వంకాయలు చాలానే ఉన్నాయి. కొంపదీసి నాకు కళ్లజోడు ఉండడం వలన వేరే కాయగూరలు నల్ల వంకాయల్లా కనబడ్డం లేదు కదా" వెటకారంగా అంది జగదాంబ.

"వచ్చింది గొర్రె" అని లలిత మనసులో అనుకుని "అయ్యో, నిన్న సాయంత్రం మీ అబ్బాయి రైతుబజారు నుండి కాయగూరలు తెచ్చి పెట్టానని చెప్పాడు. నేనే మర్చిపోయాను. గుత్తి వంకాయ వండుతానులెండి" చెప్పింది ఓ చిన్న నవ్వుతో.

"వచ్చింది గొర్రె" అని లలిత మనసులో అనుకుని- "అయ్యో, నిన్న సాయంత్రం మీ అబ్బాయి రైతుబజారు నుండి కాయగూరలు తెచ్చి పెట్టానని చెప్పాడు. నేనే మర్చిపోయాను. గుత్తి వంకాయ వండుతానులెండి" చెప్పింది ఓ చిన్న నవ్వుతో.

వంట చేస్తున్నంతసేపూ డబెల్, డిమీల్, పతక్, చటక్, దబటక్ అంటూ అంటూ ఒకటే శబ్దాలు. అలా పన్నెండున్నరకి మొదలైన వంట రెండు గంటలకి పూర్తి చేసి డైనింగ్ టేబిల్ మీద పెట్టింది.

జగదాంబ రుచి చూస్తూనే ఉడుం పిల్లలా నాలుకని రెండు సార్లు బయటికి తీసి మొహం కాస్త వికారంగా పెట్టింది. కొంచెం తిని మిగతా అన్నం సాంబారుతో తినేసింది.

సుబ్బారావ్ కొంచెం అటూ ఇటూ చూస్తూనే "బావుంది హ్, హ్, హ్" అంటూ తినేసాడు.

భోజనాలు అయ్యాక బెడ్ రూమ్‌లోకి వెళ్లి ఏ.సి. వేసుకుని పడుకున్నారు. కొంతసేపటికి సుబ్బారావు మీద జగదాంబ తన చేతిని వేయగానే "అమ్మో! నా పొట్ట పగిలిపోయింది" అని ఆమె చేతిని రెండు చేతులతో ఎత్తి పక్కన పెట్టేసాడు.

ఇంతలో కొడుకు. కోడలులో గొంతులో మాట్లాడుతున్న మాటలు హాల్లోంచి వినిపించడంతో ఓ చెవి అటు పెట్టాడు.

"అత్తయ్య, ఇలా చేస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు. సాఫీగా సాగిపోతున్న జీవితంలో ఇలాంటివి మనసుని ఓ పట్టాన మెలి పెట్టకుండా ఎలా ఉంటాయి చెప్పు. అప్పటికీ నేను 'ఆవిడంతట ఆవిడే మారుతుంది, అన్నిటికీ ఊరికే తొందర పడకూడదు' అని చాలా ఆశగా ఎదురు చూశాను. కానీ ఫలితం మాత్రం ఏం లేదు. మా నాన్న, నేను ఇప్పటి వరకూ ఆవిడ విషయంలో ఎంతో ఓపిక పడుతూ వచ్చాం. కానీ ఇక నుండి వేరు. ఆల్రెడీ ఈ విషయం మీద లాయర్‌ని కూడా కలిసాం" అని లలిత ఇంకేదో చెప్పేంతలో మధు అడ్డుపడి-

"భలేదానివే, గోటితో పోయేదానికి గొడ్డలి వరకూ ఎందుకు? ఈసారికి నా మొహం చూసి కొంచెం నెమ్మదిగా ఆలోచించు. అవన్నీ ఇప్పుడు వద్దు. నేను కూడా ఓసారి ఆవిడతో మాట్లాడి నచ్చచెబుతాను. నువు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకు. పైగా ఇప్పుడు నువ్వు ఒట్టి మనిషివి కూడా కాదు" చెప్పాడు.

"ఇప్పటివరకూ అలా అనే ఊరుకున్నాను. పైగా రిలేషన్ చెడిపోతుంది. పెద్దావిడ అని గమ్మునున్నాను. మావయ్య కూడా మంచి వ్యక్తి. ఆయన మొహం చూసి నేను ఏమనలేదు. ఇపుడు మాత్రం నేను ఓ నిర్ణయానికి వచ్చేసాను. ఇక ఆవిడతో అమీ తుమీ తేల్చుకుంటాను" చెప్పింది కోపంగా.

"అయ్యో.. అంత పని మాత్రం చేయకు లలితా" ముందు నువ్వు కొంచెం కూల్‌గా ఉండు" చెప్పాడు మధు.

"లేదు మధూ, ఇది మూడోసారి. కానీ అత్తయ్యలో మార్పు మాత్రం శూన్యం. కనుక ఈ విషయం నువ్వు కాదు అడగాల్సింది, మావయ్య. ఆయన్నే అడుగుతాను. ఆయన ఎవరి వైపు మాట్లాడతారో ఈరోజు తేలిపోతుంది" చెప్పింది లలిత అసహనంగా.

ఆ మాటలు విన్న సుబ్బారావ్ కాస్త టెన్షన్‌తో చెమట తుడుచుకుంటూనే "అబ్బా నొప్పి" అంటూ హఠాత్తుగా విలవిల్లాడిపోయాడు. ఆ తరువాత మంచం మీద అటూ ఇటూ దొర్లేస్తున్నాడు.

అతని పక్కనే పడుకున్న జగదాంబ నెమ్మదిగా నిద్ర లేచి "అబ్బా! ఏవిటండీ మీ గొడవ?" అని అతన్ని ఓసారి చూసి "ఎవరైనా నొప్పి అంటూ గుండె పట్టుకుంటారు. ఈయన మాత్రం వెరైటీ, వీపు పట్టుకుంటారు" అని నసిగి-

"ఏవిటండీ మళ్లీ కిడ్నీలో పోటు మొదలైందా?" అడిగింది.

"ఔనే.. ఏదో హార్లిక్సు తాగుతారా?" అన్నట్టు అంత తాపీగా అడుతావేంటి... ఓ పక్క నొప్పితో నేనిక్కడ నాగిన్ డాన్సు చేస్తుంటే కనబడ్డం లేదూ, లోన ఒకటే పోటు. కిడ్నీల్లో రాళ్లు తొక్కుడుబిళ్ల ఆట ఆడుతున్నట్టున్నాయి. ముందు ఆ మాత్ర ఇటు ఇవ్వు" అరిచాడు.

"సరే" అని హాండ్ బ్యాగ్‌లోంచి ఓ మాత్రం తీసి ఇవ్వగానే వేసుకుని "హమ్మయ్య, ఇప్పుడు కొంత పర్లేదు" అని ఫోన్ తీసి డాక్టర్‌కి ఫోన్ చేశాడు. తరువాత విషయం మొత్తం కొడుక్కి చెప్పి "ఊరు వెళ్లిపోతా" అన్నాడు సుబ్బారావ్.

అది వింటూనే ముఖం చిట్లిస్తూ "అదేంటి నాన్నా, వచ్చి ఒక్కరోజు కూడా కాలేదు, అప్పుడే వెళ్లిపోతారా?" అడిగాడు మధు.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

"తప్పదురా, మీ నాన్నకి ఉండుండి కిడ్నీల్లో పోటు వస్తోందట. నిమిష, నిమిషానికీ ఉండ చుట్టుకుపోతూ గిలగిల్లాడిపోతున్నారు. ఆయన చూపించుకునే డాక్టర్‌కి ఫోన్ చేస్తే ఏం ఫర్లేదు కానీ ఓసారి మామూలు చెకప్‌కి రమ్మన్నారట, వెళ్లిపోవాలి. ఇక్కడ చూపిద్దామంటే ఆయన రిపోర్ట్సు తీసుకురాలేదు. పైగా ఈయన వేరే డాక్టర్ అంటే భయం అంటున్నారు, అందుకే వెళ్లిపోదామని" చెప్పిందామె.



మధు కొంచెంసేపు ఆలోచించి "సరే నాన్నా. అయితే నేను కూడా ఓ నాల్రోజులు సెలవు పెట్టి మీతో వస్తాను" అన్నాడు.

సుబ్బారావ్ పొట్టని కాస్త ఇబ్బందిగా తడుముకుంటూ ముఖాన్ని చిట్లించి "జగదాంబా, నువ్వు వెళ్లి నాకు చిక్కని మజ్జిగలో నిమ్మకాయ పిండి పట్టుకురా" అన్నాడు.

"సరే ఉండండి.. తెస్తాను" అని ఆమె అలా వెళ్లిపోగానే "నాకు కిడ్నీపోటూ లేదూ, కాకరకాయా లేదు. ఇది బందిపోటు అర్థం కాలేదా? బంధాలకి బందీ అయిపోయి ఎవరి వైపూ మాట్లాడలేక ఈ పోటు నాటకం ఆడాను. ఇందాక కోడలి మాటలు విన్నాను. ఈరోజో, రూపో ఏదైనా గొడవైతే అది మీ మధ్య అనుబంధాన్ని దెబ్బ తీయొచ్చు. పైగా అమ్మాయిప్పుడు ఒట్టి మనిషి కాదు. అందుకే ఏ గొడవా కాకుండా ఇలా ఈ వంకతో మీ అమ్మని ఇక్కడి నుండి తీసుకువెళ్లిపోతున్నాను. ఇంటికి వెళ్లాక కోడలితో పేచీ వద్దని గట్టిగా చెప్తాలే. అయినా ఈరోజు ఇలా చిటపటలాడినా రేపు ఎలాగూ డెలివరీ అయ్యి మనవరాలో, మనవడో పుడితే అత్తా కోడళ్లిద్దరూ చక్కగా ఒకటైపోతారులే. నేను ఇలాంటివి చాలా చూసాను" అని చెప్పడంతో కంగారుగా మధు చేతులు నులుముకున్నాడు.

ఓ క్షణం తర్వాత "ఎంత పని చేశావ్ నాన్నా? మీ కోడలు 'అత్తయ్య' అంటూ మాట్లాడింది అమ్మ గురించి కాదు. వాళ్ల నాన్నగారి చెల్లెలి గురించి. అంటే వాళ్ల మేనత్త గురించి. ఆవిడ ఆస్తిలో వాటా కావాలని లలిత వాళ్ల నాన్నగారిని, లలితని వేపుకు తింటోందట. అందుకే ఈ విషయంపై లలిత ఆమెపై మండిపడుతూ నాతో చెప్పింది. ఆ విషయం నిద్రమత్తులో లేచి సగం నుండి వినడంతో నీకు ఇలా అర్థం అయింది" అని మధు చెప్తుండగానే జగదాంబ, లలితా కలిసి వచ్చారు.

లలిత చిన్న చిరునవ్వుతో "మావయ్యా, అత్తయ్యని ఇక్కడే ఉంచండి. నాకు చేదోడు వాదోడుగా ఉంటారు. అత్తయ్య మాట కరుకే కానీ మనసు బంగారం. మీరు వెళ్లిరండి. ఓ వారం తర్వాత అత్తయ్యని పంపుతాను" చెప్పింది లలిత.

"ఔనండీ, ఎప్పుడూ వచ్చే పోటే కదా, ఈ ఒక్కసారికి అక్కడున్న మా తమ్ముడిని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్లండి. ఎలాగో మనింట్లో వంట మనిషి ఉండనే ఉంది. వారం ఎంతలో గడుస్తుంది చెప్పండి" చెప్పింది జగదాంబ.

ఆ మాటలు వింటూనే "వచ్చింది గొర్రె... వెనకటికొకడు ఉపాయంతో వెళ్లి ఉబిలో పడ్డాట్ట. అలా అయింది నా పరిస్థితి. ఇపుడు నేను ఒక్కడినే వెళ్లి వారం పాటు ఇంట్లో ఏం చేయాలి?" అని మనసులో అనుకుంటూ ఏడుపుగొట్టు మొహంతో "సరే.." అన్నట్టు బలవంతంగా తలూపాడు సుబ్బారావ్.

■

---

చిన్న కథ

# మార్పు

బస్సు వేగంగా పరిగెడుతోంది. కిటికీ పక్కన కూచున్న నాకు తగిలే చల్లటి గాలిని అనుభవిస్తున్న నా మనసు నాలుగు రోజుల వెనక్కి పరిగెత్తింది.

గోపి మా ఆఫీసులోనే పని చేస్తాడు. ఒకరోజు లంచ్‌కి మేమిద్దరం హోటల్‌కి వెళ్లాల్సి వచ్చి వెళ్లాం. భోజనం చేస్తూ మాటల మధ్యలో తల్లిదండ్రుల విషయం వచ్చి "నా తల్లిదండ్రులు నా దగ్గరే ఉన్నారు. నా భార్య కూడా చక్కగా చూసుకుంటుందని" చెప్పాను. తన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్చానని చెప్పాడు గోపి. "అదేంటి? నీ భార్యకి, వాళ్లకి పడటం లేదా?" అని అడిగా. దానికి సమాధానంగా ఒక నిట్టూర్పు విడిచి "ఏం చెప్పనండీ? నేను పెరిగిన వాతావరణం వేరు, నా జీవితం వేరు. నేను మూడో తరగతి చదువుతున్నప్పుడే నేను వెళ్లనని ఏడుస్తున్నా కొట్టి తిట్టి మంచి చదువు, క్రమశిక్షణ అంటూ హాస్టల్‌లో చేర్పించారు. అప్పటి నుండి నా ప్రపంచం హాస్టలు, తోటి ఫ్రెండ్స్ అంతే. సెలవులంటూ కొన్ని రోజులు ఇంటికి వచ్చినా, చదువు గురించి, మార్కుల గురించే చర్చ. కన్నవారి ప్రేమ పొందింది తక్కువనే చెప్పాలి. ఇక క్లాసులు పెరిగినకొద్దీ ఏవో సాకులు చెప్పి ఇంటికి వెళ్లడం తగ్గించాను. కాలేజీ చదువులకు వచ్చేసరికి పోటీ పరీక్షలు, కోచింగ్ అంటూ వాళ్లే నన్ను రానిచ్చేవారు కాదు. ఈ విధంగా జీవితమంతా హాస్టలు, ఫ్రెండ్స్... ఇలా వేరేగా అయిపోయింది. నాకు ఉద్యోగం వచ్చింది, పెళ్లయింది. మా నాన్న చేస్తున్న ఉద్యోగం నుండి రిటైర్ అయ్యారు. కొన్ని రోజులు వాళ్లను నా దగ్గరే ఉంచుకున్నాను కానీ నేనే వాళ్లతో ఇమడలేకపోయాను. ఎందుకో నాకే తెలియని పరిస్థితి. అందుకే వారిని ఒప్పించి వృద్ధాశ్రమంలో ఉంచానని" చెప్పాడు గట్టిగా తుడుచుకుంటూ కన్నీళ్లో, మరేమిటో తెలియలేదు. గోపి చెప్పిన మాటలకు నా గుండెలో రాయి పడినట్టయింది. నా భార్య పోరు పడలేక ఐదో తరగతి చదివే నా కొడుకుని చదువు, క్రమశిక్షణ పేరుతో వేరే ఊళ్లోని హాస్టల్లో గత సంవత్సరమే జాయిన్ చేసా.

సాయంత్రం ఇంటికి వచ్చాను అన్యమనస్కంగా. గోపీ కథ విని ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు. ఒక నిర్ణయానికి వచ్చా. మనసంతా తేలికై, హాయిగా నిద్ర పోయాను. తెల్లవారింతర్వాత నా భార్యను కూర్చోబెట్టి గోపీ గురించి చెప్పి "మన పిల్లవాడికి, మనకు అటువంటి పరిస్థితి రాకూడదు. మనం ఇద్దరం ఉద్యోగస్తులమే కనుక మనమే సమయాన్ని సర్దుబాటు చేసుకుని మన బాబుకి అన్నీ మనమే చూసుకుందాం. వాడిని తెచ్చుకుని మన దగ్గరే ఉంచుకుని చదివిద్దాం" అని చెప్పాను. నా మాటలకు నా భార్య కూడా ఒప్పుకున్నది. హారన్ గట్టిగా వినబడేసరికి మనసు ప్రస్తుతానికి వచ్చింది. నేను దిగవలసిన స్టేజీ వచ్చింది. బస్సు దిగి నా కొడుకుని తీసుకురావడానికి హాస్టల్ వైపు నడిచా... ఆనందంగా.

**- జి.మధుమురళి**

# మౌనం

యామిజాల జగదీశ్

**మౌనం చిన్న మాటే. కానీ అర్థాలనేకం. అన్ని మౌనాలూ ఒకేలాంటివి కావు. మాట్లాడకుండా ఉండటం మౌనమే. కానీ లోలోపల ఏవేవో ఆలోచనలు పరుగులు తీస్తుంటాయి. మనసుని ఉత్తినే ఉండనివ్వవు. కానీ ఏ ఆలోచనలూ లేకుండా మౌనంగా ఉండటం అంత సులభం కాదు. నిశ్చలంగా ఉండే మౌనాన్ని సాధించగలిగితే మన మీద మనకు ఓ నియంత్రణ వచ్చినట్లే.**

**ఆ మౌనానికి ఉన్న బలం అంతా ఇంతా కాదు.**

ఇటీవల ఓ పెద్దాయన తను రాసుకున్న పుస్తకం(అముద్రితం) ఒకటిచ్చి చదవమంటే కళ్లప్పగించాను. మనసు తెరిచాను. అందులో ఇలా ఉంది...

“ఒకరి మౌనానికి నిజంగా భిన్నమైన అర్థాలు ఉంటాయి.

ఓ ఏడాది క్రితం నా మౌనం అలసిపోయింది. అప్పుడు దానికి ఎవరినీ ఎదుర్కొనే శక్తి లేదు, ఎందుకంటే నిద్ర లేవడం కూడా చాలా కష్టమైన పనిగా ఉంది.

నా మౌనం నాకు రక్షణ అవసరం అని అర్థం, కానీ నా బుర్రలో ఓ ఘోష అంది.. సహాయం కోసం అడుగుతున్న నా స్వరాన్ని నేను వినలేకపోయాను. శబ్దం నన్ను కట్టేసింది.

నిశ్శబ్దాన్ని భరించడం, అధిగమించడం అంత సులభం కాదు.

అప్పుడు నా మౌనం వల్ల నేను తీవ్ర బాధలో ఉన్నాను.

కానీ నేను దానిని వేరొకరితో పంచుకోకూడదని నిర్ణయించుకున్నాను. ఎందుకంటే నేను నా మౌనాన్ని చెప్పడానికి సరైన మార్గం నా చెంత లేదు.

నా మౌనం అంటే నెలల తరబడి ప్రజలను తప్పించడమే. ఎందుకంటే చుట్టూ చూసీ చూసీ నా మది అలసిపోయింది. కాబట్టి నేను



దూరంగా ఉండటాన్ని ఎంచుకున్నాను. నా ఈ చర్యను చాలా మంది తప్పుగా అర్థం చేసుకున్నారు.

అయినా నేను పట్టించుకోలేదు. నాకు... నాకంటూ ఓ స్వంత సమయం కావాలి.

కానీ ఈ రోజుల్లో....

నా మౌనం అంటే తృప్తిగా ఉండటం. నేను సంతోషంగా ఉన్నానని ప్రపంచానికి నిరూపించాల్సిన అవసరం లేదు. ఆ మౌనానందంలో నేను ఉన్నానన్న నిజం నాకు మాత్రమే తెలుసు. ఇప్పుడు నా మౌనం అంటే నా హృదయాన్ని, మనస్సుని బాగు చేసుకోవడం. విచారంగా ఉండటానికి బోలెడు కారణాలు ఉంటాయి. నేను వాటితో సరిగ్గా వ్యవహరించగలను. కానీ నా మౌనం అంటే జీవితాన్ని కొనసాగించడానికి చిన్న చిన్న కారణాలను కనుగొనడం. అది కష్టమే అయినప్పటికీ తప్పదు నా మౌనం అంటే నాకు కలిగే ఆనందాన్ని నిలుపుకోవడం.

అందుకే ఈ రోజుల్లో నా మౌన నిశ్శబ్దం ఓ అర్థమున్న ఆనందం. నేను సుఖంగా ఉన్నానని అర్థం. శాంతి అని అర్థం.

నిశ్శబ్దమే నిజమైన ఉపదేశం అని భగవాన్ రమణ మహర్షి ఉత్తినే చెప్పేరా? పరిణతి చెందిన సాధకులకే ఆ ఉపదేశాన్ని అందుకోవడం సాధ్యమవుతుంది. ఇతరులు దానివల్ల లబ్ధి పొందలేరు. అందుకనే వాళ్లకు సత్యం అర్థమయ్యేలా చెప్పడానికి మాటలు అవసరమయ్యాయంటారు. కానీ సత్యం మాటలతో అర్థమయ్యేది కాదు. అంతకు మించినది. దానికి వివరణ అవసరం లేదు. మాటలతో కేవలం దానిని సూచించవచ్చు. కానీ తెలుసుకోవడం ఎలా?


## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.

మీ రచనలు పంపించవలసిన చిరునామా:

నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

# రెండు రంగుల 'రాజా రాణి ఆలయం'

**ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

ఆలయాల నగరంగా ప్రసిద్ధి చెందింది ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్. ఈ ఏకామ్ర క్షేత్రంలో ఒకప్పుడు వెయ్యికి పైగా ఆలయాలు ఉండేవని ప్రతీతి. గతంలో ఈ ప్రాంతం అనేక మామిడి వనాలతో నిండి ఉండేదట. అలా ఏకామ్ర క్షేత్రంగా పేరొందింది. పరాయి పాలకుల దాడులలో అనేక ఆలయాలు కనుమరుగయ్యాయి. మరికొన్ని కాలగమనంలో శిథిలమయ్యాయి. ప్రస్తుతం చాలా కొద్ది నిర్మాణాలు మాత్రమే కనపడుతున్నాయి. వాటిల్లో నిత్య పూజలు జరుగుతున్నవి కొద్ది మాత్రమే. మిగిలినవన్నీ మూలవిరాట్టులు లేకుండా కనపడతాయి. కానీ ఇప్పుడు కనిపించే ప్రతి ఒక్క నిర్మాణం నాటి శిల్పుల నేర్పరితనాన్ని, వృత్తి పట్ల వారికి గల అచంచల భక్తి శ్రద్ధలను మనకు ఘనంగా చూపుతాయి.

అధిక శాతం నిర్మాణాలు పది నుండి పన్నెండవ శతాబ్దాల మధ్య కాలంలో నిర్మించబడ్డాయి. వీటిల్లో అనేక శృంగార శిల్పాలు కనపడటం నాటి శిల్పుల పైన ఖజురహో నిర్మాణాల ప్రభావం ఉందన్నది చరిత్రకారుల అభిప్రాయం.

ఈ నిర్మాణాలన్నీ స్థానికంగా లభించే ఒక రకమైన రాతితో నిర్మించబడ్డాయి. మూల విరాట్టు లేకున్నా శాసనాల ఆధారంగా వీటిని రకరకాల పేర్లతో పిలుస్తారు. ఇవన్నీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఈ కారణంగా పురావస్తు శాఖ ప్రస్తుతం చేపట్టిన తవ్వకాలలో అనేక ఆలయ శిథిలాలు బయల్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రసిద్ధ లింగరాజ ఆలయ పరిసరాలలో అనేక శిథిల నిర్మాణాలు వెలుగు చూస్తున్నాయి.

ఈ పురాతన ఆలయాలు, నిర్మాణాలు పాత భువనేశ్వర్‌లోని 'బిందు సాగర్' సరోవరం చుట్టూ నెలకొని ఉంటాయి. ఇవన్నీ భువనేశ్వర్‌ని పరిపాలించిన సోమవంశి, తూర్పు గంగ వంశ రాజులు పాలనా కాలంలో నిర్మించారు.

అలాంటి నిర్మాణాలలో ముఖ్యమైనది 'రాజా రాణి మందిరం'. సుమారు పదకొండవ శతాబ్దంలో నిర్మించబడిన ఈ ఆలయం నేటికీ గొప్ప ఆకర్షణీయమైన నిర్మాణంగా పేరొందింది.

స్థానికంగా లభించే ఒక ప్రత్యేకమైన ఎరుపు, పసుపు రంగులలో ఉండే ఇసుక రాతితో నిర్మించడం వలన 'రాజా రాణి ఆలయం' అని పిలుస్తారు. ఒక రంగు రాజైతే, మరో రంగు రాణి. అలా రాజారాణి ఆలయం అని పిలవబడుతోంది. నిర్మాణంలో కనిపించే శృంగార శిల్పాల కారణంగా 'ప్రేమ మందిరం' అని కూడా పిలుస్తారు. ప్రస్తుతం పురావస్తు శాఖవారి ఆధ్వర్యంలో ఉన్న ఈ మందిరాన్ని సందర్శించడానికి టికెట్ నిర్ణయించారు. సాయంత్రంపూట లేక రాత్రి సమయంలో విద్యుత్కాంతులలో రాజారాణి మందిరాన్ని వీక్షించడం ఒక మరుపురాని జ్ఞాపకంగా మిగిలిపోతుంది.



రెండు అడుగుల ఎత్తయిన పీఠం మీద ఈ మందిరం రెండు భాగాలుగా నిర్మించబడింది. ఒడిశా ఆలయాలలో ప్రధాన దైవం కొలువైన 'దేవుల' (గర్భాలయం); భక్తులు స్వామిని వీక్షించే 'జగన్మోహన'(ముఖ, సభ/నాట్య మండపం). దేవులా జగన్మోహన కన్నా ఎత్తుగా ఉంటుంది. జగన్మోహన నలుచదరంగం లేదా దీర్ఘ చతుర ప్రాకారంలో ఉంటుంది. దేవులా పైన శిఖరం, గోపురం కలశం ఉంటాయి. జగన్మోహన పైన చిన్న గోపురాకార నిర్మాణం ఉంటుంది. శ్రీ లింగరాజ, శ్రీ జగన్నాథ మందిరాలలో 'నట మండపం' అని మరొక నిర్మాణం కనపడుతుంది.

ఒడిశాలో మూడు రకాల ఆలయాలు కనిపిస్తాయి. 'రేఖ, పిద శైళి' ఆలయాలు ముఖ్యంగా విష్ణు, శివ, సూర్యదేవులకు ఉద్దేశించబడ్డాయి. మూడో రకమైన 'ఖాఖర శైళి' ఎక్కువగా కాళి, చండీ, దుర్గాదేవి ఆలయాలలో కనపడుతుంది. సోమవంశీ రాజులు నిర్మించిన ఈ ఆలయ విమానం ఎత్తు సుమారు అరవై అడుగులు. రాజారాణి మందిరం పంచరథ శైళి నిర్మాణంగా పేర్కొంటారు. జగన్మోహన, దేవుల వెలుపలి గోడల పైన నర్తకీమణుల, నాగుల శిల్పాలు జీవం ఉట్టిపడేలా చెక్కబడ్డాయి. కొన్ని శృంగార శిల్పాలు కూడా కనిపిస్తాయి. రాతి మీద సూక్ష్మాతి సూక్ష్మ చెక్కడాలను ఎంతో నైపుణ్యంతో మలచారు నాటి శిల్పులు. ఎనిమిది దిక్కులలో అష్ట దిక్పాలకులను కూడా మలచారు.

జగన్మోహన చేరుకోడానికి మెట్లు ఉంటాయి. ద్వారానికి ఇరుపక్కలా కైలాస ద్వార పాలకులు, నాగ నాగిని స్థంభాలు, ద్వారానికి పైన నవగ్రహాలను సుందరంగా చెక్కారు. స్థంభాల కింద ఏనుగులను, సింహాలను ఏర్పాటు చేసిన విధానం ముచ్చట గొలుపుతుంది. పైన సింహాల్ని పోలిన ఒక ఇతిహాస మృగం, కలశం ఏర్పాటు చేశారు.

లోపల ఒకప్పుడు దేవతా మూర్తులు ఉన్న దాఖలాలు కనపడతాయి. ప్రస్తుతం అవి ఖాళీగా దర్శనమిస్తాయి. దేవుల పై భాగంలో వర్తులాకార కలశం ఏర్పాటు చేశారు. నగారా శైలిలో ఉన్న దేవుల వెలుపలి భాగంలో అనేక చిన్న చిన్న శిఖరాలు, విమానాల మధ్య మధ్యలో నాయకీమణుల శిల్పాలను ఒక పద్ధతిలో అమర్చారు. రాజా రాణీ మందిరం ఎందరో చరిత్రకారుల దృష్టిని ఆకర్షిస్తోంది. రాజా రాణి మందిర నిర్మాణం ఖజురహోలోని నిర్మాణాలను పోలి ఉంటుందని కొందరి చరిత్రకారుల అభిప్రాయం.

భువనేశ్వర్‌లో ఇప్పుడు కనిపించే నిర్మాణాలను పరిశీలిస్తే వాటికి రాజా రాణి మందిరానికి ఉన్న నిర్మాణ పరమైన భేదం తెలుస్తుంది. మందిర పరిసరాలను పచ్చని పచ్చికబలుతో, మొక్కలతో సుందరంగా మలచారు. ఒక సాయంత్రాన్ని జీవితాంతం గుర్తుంచుకోతగినదిగా మార్చుకోవాలంటే భువనేశ్వర్ సందర్శనలో రాజారాణి మందిర పరిసరాలలో గడపడం తప్పనిసరి.


# ఆస్ట్రేలియాలో అరుదైన పర్వతాలు

షేక్ అబ్దుల్ హకీం జాని

ఆస్ట్రేలియాలో అరుదైన అనేక పర్వతాలు ప్రకృతి శోభతో పర్యాటకులకు నయనానందం కలిగిస్తున్నాయి. ఈ పర్వతాలు వేటికవే తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. మౌంట్ కోస్కియుస్కో అనేది ఆస్ట్రేలియా ప్రధాన భూభాగంలో ఎత్తయిన పర్వతం. మౌంట్ కోస్కియుస్కో ఆస్ట్రేలియన్ ఆల్ప్స్, ఆగ్నేయ న్యూ సౌత్ వేల్స్‌లోని మంచు పర్వతాలలో సముద్ర మట్టానికి 2,228 మీటర్ల ఎత్తులో నెలకొని ఉన్నాయి. దీన్ని ఆస్ట్రేలియాలో ఎత్తయిన శిఖరంగా పేర్కొన్నారు. పోలెండ్‌కు చెందిన అన్వేషకుడు 1840లో ఈ పర్వతానికి మౌంట్ కోస్కియుస్కో అని నామకరణం చేశారు. కోస్కి యుస్కో అనేది పోలెండ్‌కు చెందిన దేశభక్తుని పేరు. ఆయన గౌరవార్థం ఈ పేరు పెట్టారు. పర్వతానికి సమీపంలో కోస్కియుస్కో జాతీయ ఉద్యానవనం ఉంది. శీతాకాలంలో ఈ పర్వతం మంచుతో నిండిపోతుంది. ఆ సమయంలో అనేక రకాల క్రీడలను నిర్వహిస్తారు. హెలికాప్టర్, చిన్న విమానాలలో ప్రయాణిస్తూ ఈ పర్వత అందాలను తిలకించవచ్చు.

## గ్లాస్‌హౌస్ పర్వతాలు

ఈ పర్వతాలు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ సముద్ర తీరానికి కొన్ని మైళ్ల దూరంలో నెలకొని ఉన్నాయి. ఇవి 13 శిఖరాల సమూహం. అన్ని శిఖరాలు ఒకే ఎత్తులో ఉండవు. సముద్ర మట్టానికి 556 మీటర్ల ఎత్తులో ఇవి నెలకొని ఉన్నాయి. అన్వేషకుడు కెప్టెన్ కుక్ 1770 మే 17న ఈ ప్రాంతాన్ని సందర్శించి ఈ పర్వతాల సమూహానికి గ్లాస్ హౌస్ పర్వతాలు అని నామకరణం చేశారు. రమారమి పాతిక మిలియన్ సంవత్సరాల క్రితం భూకంపాలతో పాటు అగ్ని పర్వతాల లావా పొంగి చల్లారి ఇసుక రాతి మైదానం ఏర్పడింది. కరిగిన శిలలు చిన్న గుట్టలుగా ఏర్పడ్డాయి. అనేక సంవత్సరాల తరువాత ఈ ప్రాంతం చుట్టూ ఎత్తుగా ఉన్న రాళ్లు కొన్ని వందల మీటర్ల దిగువకు చేరి గ్లాస్ పర్వతాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ పర్వతాల పక్కన వర్షాలు అధికంగా కురవడంతో అనేక రకాల మొక్కలు పెరిగి ఇప్పుడు మహావృక్షాలుగా ఎదిగి జాతీయ ఉద్యానవనంగా విరాజిల్లుతోంది. ఈ శిఖరాల్లో కొన్నింటిని సునాయాసంగా అధిరోహించవచ్చు. కొన్ని శిఖరాలైతే శారీరకంగా దృఢంగా ఉన్నవారు మాత్రమే ఎక్కగలరు. ఈ శిఖరాలపై నుండి కిందకు చూస్తే ప్రకృతిశోభ రమణీయంగా కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో కంగారుతో పాటు పలు రకాల జంతువులు కనిపిస్తాయి. ఇక్కడ ఉన్న మరికొన్ని శిఖరాలకు సంప్రదాయ పేర్లను పెట్టారు. మాథ్యూఫ్లిండర్ అనే పర్వతాన్ని 1799లో మౌంట్ బీర్‌బర్క్ అనే అన్వేషకుడు అధిరోహించాడు.



గ్లాస్‌హౌస్ పర్వతాలను 2006 ఆగస్టు 3న ఆస్ట్రేలియా జాతీయ వారసత్వ సంపద జాబితాలో చేర్చారు. క్వీన్‌లాండ్ 150 చిహ్నాలలో ఒకటిగా గ్లాస్‌హౌస్ పర్వతాలను 2009లో చేర్చారు. ఈ శిఖరాలలో మౌంట్ బీర్బురమ్ 278 మీటర్లు, మౌంట్ బీర్వా 556 మీటర్లు, మౌంట్ కూచిన్, ది కూచిన్ హిల్స్ పేర్లతో పిలిచే శిఖరం 235 మీటర్లు, మౌంట్ కూనోవ్రిన్, క్రూకెనెక్, ఫేక్‌బిగ్ పేర్లతో శిఖరం 377 మీటర్లు, మౌంట్ ఎలిండా, ది సాడిల్ బ్యాక్ పేర్లతో పిలిచే శిఖరం 109 మీటర్లు, మౌంట్ టిబెరో వుక్కుమ్ 220 మీటర్లు, మౌంట్ టిబ్రోగార్గన్ 364 మీటర్లు, కూయా 177 మీటర్లు, తున్ను బుడ్ల పర్వతం 338 మీటర్లు, వైల్డ్ హార్స్ పర్వతం 128 మీటర్లు, కూలం పర్వతం 208 మీటర్లు, నిండరీ పర్వతం 306 మీటర్ల ఎత్తును కలిగి ఉన్నాయి. ఈ పర్వత ప్రాంతాలలో జియుబారా, గుబ్బి గుబ్బి తెగలకు చెందినవారు నివసిస్తుంటారు. జినిబారా తెగ ప్రజలు బీర్వా పర్వతాన్ని ఎంతో ప్రముఖమైనదిగా భావిస్తారు.

## మౌంట్ కుక్

ఆస్ట్రేలియాలో 700 చ.కి.మీ. విస్తరించి ఉన్న జాతీయ వనం మధ్య భాగంలో 3,754 మీటర్ల ఎత్తులో మౌంట్‌కుక్ పర్వతం ఉంది. ఇది న్యూజిలాండ్‌లో ఎత్తయిన మంచు పర్వతం. ఈ పర్వతం దక్షిణ ఆల్ప్స్‌లో ఉంది. దక్షిణ ద్వీపం పొడవునా ఉన్న పర్వత శ్రేణి. ఈ పర్వతంపై 2 వేల మీటర్ల ఎత్తయిన 140 శిఖరాలతో పాటు 72 మంచు దిబ్బలు ఉండటం విశేషం. కెప్టెన్ స్టోర్ అనే పర్వతారోహకుడు 1851లో ఈ ప్రాంతాన్ని సందర్శించి దీనికి మౌంట్‌కుక్ అని నామకర్ణం చేశారు. 1998 తరువాత అధికారికంగా ఈ పర్వతాన్ని మౌంట్‌కుక్, ఒరకి అనే పేర్లతో పిలుస్తున్నారు. ఒరకి అంటే స్థానికంగా మాట్లాడే మోరీ మోరీ భాషలో మేఘాలను చీల్చేది అని అర్థం. ఒరకి గ్రామం తాస్మానియా అనే నదీ తీరాన ఉంది. ఇక్కడ నుండి మౌంట్‌కుక్ పర్వతాలను తిలకించినట్ల యితే ఏ శిఖరం పెద్దదో సునాయాసంగా చెప్పవచ్చు. మౌంట్‌కుక్ పర్వతంపై నెల కొని ఉన్న కాస్మమన్ మంచుదిబ్బ 27 కి.మీ. పొడవు ఉంటుంది. కొన్ని చోట్ల ఇది 3 కి.మీ. వరకు కూడా వెడల్పు ఉంటుంది. ఆసక్తిగల పర్వతారోహకులు, పర్యాటకులు ఈ పర్వతాన్ని అధిరోహిస్తుంటారు.

నడిచి ఎక్కలేనివారు విమానాలు, హెలికాప్టర్లలో ఈ పర్వత శిఖరాన్ని చేరుకుని తిలకించే అవకాశం కల్పించారు. ఆస్ట్రేలియాకు చెందిన ఫెడాడు అనే మహిళ మౌంట్ కుక్‌ను అధిరోహించిన తొలి వనితగా చరిత్రకెక్కింది.

## నీలి పర్వతాలు

తూర్పు ఆస్ట్రేలియాను వేరు చేస్తున్న అతి పెద్ద పర్వత శ్రేణి నీలి పర్వతాలు. నీలి పర్వతాలు ఆస్ట్రేలియాలోని న్యూసౌత్ వేల్స్‌లో నెలకొని ఉన్న పర్వత శ్రేణి. ఇవి సముద్ర మట్టానికి 3,314 అడుగుల ఎత్తులో ఉన్నాయి. అద్భుతమైన శిఖరాలు, జలపాతాలు, లోయలు, గుహలు, అరణ్యాలు, పచ్చదనంతో నిండిన జాతీయ అడవులు ఈ ప్రాంతంలో చూడవచ్చు. ఈ ప్రాంతంలో గొలెటి శిఖరంపైకి ఎక్కి చూస్తే బ్రిడాల్ జలపాతం, పల్పిట్ రాతిగుట్టను తిలకించవచ్చు. నీలి పర్వతానికి పశ్చిమంగా జెనోయిమ్ గుహలు నెలకొని ఉన్నాయి. ఒకప్పుడు వీటిని చూడాలంటే సరైన దారి లేక ఇబ్బంది పడేవారు. ఇప్పుడు అనేక దారులు ఏర్పడి యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు రావడంతో అనేకమంది వెళ్లి తిలకిస్తున్నారు. యూకలిప్టస్క్ చెట్లు, పొగమంచు నుండి వచ్చే వాయువుల మధ్య రసాయన చర్య ఫలితంగా నీలం రంగు భ్రాంతి కారణంగా నీలంగా కనిపించడం వల్ల బ్లూ మౌంటెన్స్ అనే పేరు వచ్చింది. ఈ పర్వతాలు యూకలిప్టస్ చెట్ల వంటి విస్తారమైన వృక్షజాలం,



జంతుజాలానికి నిలయంగా ఉన్నాయి. ఇవి పర్వతాలలో చాలా భాగాన్ని ఆక్రమించాయి. అంతరించిపోతున్న నలభై కంటే ఎక్కువ జాతుల వన్యప్రాణులు ఇప్పటివరకు బ్లూ మౌంటెన్స్‌లో ఆశ్రయం పొందాయి. ప్రపంచంలో ఏర్పడిన పురాతన సహజ లోయలలో ఇవి ఒకటి. నీలి పర్వతాలు ఉత్కంఠభరిత ప్రకృతి రమణీయతకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పవచ్చు. బ్లూ మౌంటెన్స్‌ను 2000 నవంబరు 29న యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు. దీనికి సమీపంలో బ్లూ మౌంటెన్స్ జాతీయ పార్కు ఉంది. దీన్ని కూడా 2000 సంవత్సరంలో యునెస్కోవారు ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చారు.

## అయెర్స్ రాక్స్



స్థానికులు వీటిని పవిత్రమైన ఎర్ర రాతి పర్వతాలుగా భావిస్తారు. ఈ ఎర్ర రాతి పర్వతం సూర్యాస్తమయ సమయంలో ఎర్రగా, ధగ ధగా మెరుస్తూ ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. ఈ పర్వతాలను ఆస్ట్రేలియా వాసులు అయెర్స్ రాక్స్ అని పిలుస్తారు. చూడగానే ఎర్రని రాతి కొండలా కనిపిస్తుంది. ఈ పర్వతం ఒకవైపు రెండున్నర కిలోమీటర్లు, మరోవైపు మూడున్నర కిలోమీటర్ల వెడల్పుతో పాటు 350 మీటర్ల ఎత్తు ఉండే ఇసుక రాతి గుట్ట. అయెర్స్ రాక్స్‌కు మిలియన్ల సంవత్సరాల చరిత్ర ఉంది. భూకంపాలు సంభవించినప్పుడు వచ్చిన లావా ముద్దలా ఏర్పడి ఈ ఎర్రరాతి పర్వతాలు ఏర్పడినట్లు చెబుతుంటారు. అయెర్స్ రాక్స్ వద్ద గుహలు ఉన్నాయి. ఇక్కడ లోకిజ, పింజంజూజరా తెగలవారు నివసిస్తున్నారు. ఈ గుహలతో పాటు పర్వత పాదాల చెంత ఉన్న కొలనును సైతం చాలా పవిత్రమైనదిగా ఇక్కడి గిరిజనులు భావిస్తుంటారు.

## క్రేడిల్ పర్వతం

ఆస్ట్రేలియాలోని టాస్మానియా సమీపంలో సెంట్రల్ హైలాండ్స్ వద్ద ఇవి నెలకొని ఉన్నాయి. ఈ పర్వత శిఖరం 1,545 మీటర్ల ఎత్తును కలిగి ఉంది. దీన్ని అధిరోహించడానికి దాదాపు 8 గంటలు పడుతుందని అంచనా. క్రేడిల్ పర్వతం టాస్మానియా జాతీయ వనానికి ఉత్తర భాగంలో ఉంది. ఈ పర్వతానికి దక్షిణాన చాలా దూరంలో సెయింట్ లేక్ పేరుతో ఒక మంచినీటి సరస్సు ఉంది. అద్భుతమైన పర్వతాలతో పాటు జలపాతాలు, మంచు కొలనులు, మైదానాలు మొదలైనవి నయనానందం చేస్తాయి.

## జోర్డ్స్ పర్వత శ్రేణులు

పియోర్డ్‌లాండ్ తీరాన గల న్యూజిలాండ్ ద్వీపాల్లో జోర్డ్స్ అని పిలిచే పర్వత శ్రేణులు ఉన్నాయి. చాలా సంవత్సరాల క్రితం ఇక్కడ మంచు చిట్లి విచిత్రమైన శబ్దాలు వచ్చేవి. ఆ శబ్దాలను మిల్‌పోర్డ్ సౌండ్ అని పిలిచేవారు. ఇప్పుడు ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో మంచు కరిగిపోవడం వల్ల కొలనులు, జలపాతాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఆల్జైన్ పర్వతాలు, పచ్చిక బయళ్లు, చిన్న చిన్న మొక్కలతో శోభాయమానంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో వర్షపాతం హెచ్చుగానే ఉంటుంది. ఇక్కడ ప్రధానంగా అడవి జంతువులు, డాల్ఫిన్ చేపల అరుపులు, పక్షుల కిలకిలా రావాలు వినిపిస్తుంటాయి.

తెలుగు సాహిత్యం భాష, భావ పరంగా నవ్య సాహిత్య వికాసంలో నవలలు, కథలు, హాస్య కథలు, బాల సాహిత్యం మధ్య తరగతి కుటుంబాలను, ముఖ్యంగా మహిళలకు మరింతగా సన్నిహితం చేసింది. చిత్రకారునిగా బాపు, రచయితగా ముళ్లపూడి వెంకటరమణల కళా సృష్టి తెలుగునాట మధ్య తరగతి మందహాసాలను వర్షింపచేసింది. మనసుకి ఆహ్లాదం కలిగించే సరసమైన అలకలు సృష్టించి సంసార పక్షంగా నవ్వుకొనే హాయయిన కథా సృష్టికి ముళ్లపూడి వెంకటరమణ ఆద్యులయ్యారు.

# ముళ్లపూడి సాహితీ రమణీయం

జయసూర్య

అంతకుముందు మునిమాణిక్యం వంటి రచయితలు, ఇళ్లల్లో నిజ జీవితంలోని సమస్యలను మరిచిపోగల 'కాంతం' పాత్ర, అటువంటి కథల ఒరవడిగా ముళ్ళపూడి వెంకటరమణ ఇళ్ళల్లో జరిగే రొమాంటిక్ కథలు రచించారు. కథ, నవల, వ్యాసం, పద్యం, పాట, చలనచిత్ర సంభాషణలు, అనువాద రచనలు, జీవిత చరిత్ర, ఆత్మకథ వివిధ సాహితీ ప్రక్రియలలో తన అరుదైన తన ముద్రతో రమణ, రస హృదయులైన తెలుగు పాఠకులను సమ్మోహింపచేసారు.

బొమ్మల బొరుసు, బొమ్మల కథలు, అపురూప షష్టిపూర్తి, శ్రీరామాంజనేయం ఎన్నో హాస్య కథలు రచించారు. పిల్లల పుస్తకం బుడుగు తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం పొందింది. ఆత్మకథ 'కోతికొమ్మచ్చి' పేరిట వెలువడింది. ముళ్ళపూడి తెలుగు సినిమా రచయితగా కొత్త ఒరవడి సృష్టించారు. బాపు సహచరునిగా, సాక్షి, పంచదార చిలక, ముత్యాలముగ్గు, గోరంత దీపం, మనవూరి పాండవులు, శ్రీకృష్ణ లీలలు, రాజాధిరాజు, పెళ్లిపుస్తకం, మిస్టర్ పెళ్లాం, రాధా గోపాలం వంటి సినిమాలకు రచయిత, తెలుగు సాహిత్యాన్ని సామాన్య సినీ ప్రేక్షకులకు, వినోద హాస్య, చమత్కార భరితంగా కనుల విందుగా అందించారు. 1945లో బాల పత్రికలో ముళ్ళపూడి మొదటి కథ అచ్చయింది. 'ఉదయభాను' పత్రిక ప్రారంభించి ఎడిటర్ అయ్యారు. 1954లో ఆంధ్ర పత్రికలో పని చేసేటప్పుడే బుడుగు, చిన్న పిల్లల భాష, మనస్తత్వం, అల్లరి గురించి హాస్య ప్రధానంగా బాపూ బొమ్మలతో నేటికీ అలరిస్తోంది.




ఋణానందలహరి (అప్పుల ప్రహసనం) విక్రమార్కుని మార్కు సింహాసనం-సినీ మాయాలోక చిత్ర విచిత్రం, గిరీశం లెక్చర్లు సినిమాలపై సెటైర్లు, రాజకీయ బేతాళ పంచ వింశతి(రాజకీయ చదరంగం) ఇద్దరమ్మాయిలు ముగ్గురబ్బాయిల ప్రేమాయణం, పత్రికలలో ప్రచురింపబడినవే కాకుండా సినిమా కథలు, సంభాషణలతో సహా 8 సంపుటాలు వచ్చాయి.

కథా, బాల, కదంబ, సినీ, అనువాద, రమణీయాలుగా రమణ సాహిత్యం వెల్లివిరిసింది. తిరుప్పావై దివ్య ప్రబంధం మేలుపలుకుల మేలుకొలుపులు, భాగవత కథలు, రామాయణం(ముళ్ళపూడి, బాపు) వైవిధ్య భరితమైన, విస్తృతమైన ఈ కథల పలుకుబళ్లు, కొత్త పదాలు, విలక్షణ పాత్రలు హాస్య, వ్యంగ్య రూపాలుగా సాహిత్యాన్ని సంపన్నవంతం చేసాయి. తేనెగూడు వంటి వాటాల ఇళ్లల్లోని మధ్య తరగతి కుటుంబాల జీవితాలను ఆ టీ కప్పులో తుఫానులు జనతా ఎక్స్‌ప్రెస్ వంటి కథాంశాలకు ముడి పెట్టారు.

జీవిత పోరాటంలో ఎదుర్కొన్న అనుభవాలు ప్రతిబింబింపచేస్తూ, కథలకు ముడిసరుకుగా కష్ట నిష్టూరాలు ఉన్నా హాస్యం, వ్యంగ్యంతో తొణికింపచేసారు.




సీతా కల్యాణం, ఒక అద్భుత కళాసృష్టి. 1950-60 నాటి తెలుగు పట్టణ ప్రాంతాలలో ప్రేమ పేరిట వెర్రి మొర్రితనాలు, రాజకీయాల ఎత్తుగడలు, కోర్కెల పరుగు పందాలు, దాంపత్య జీవన మాధుర్యం, పేదల ఆకలి, నిరుద్యోగుల వేదన, మధ్య తరగతి జీవితాలను ప్రతిభావంతంగా ప్రతిబింబింపచేసారు.

1931 జూన్ 28న జన్మించిన ముళ్ళపూడి వెంకటరమణ 2011 ఫిబ్రవరి 24న కన్ను మూసేవరకు తెలుగు చదువరులు, సినీ ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొంటూనే ఉన్నారు. 1995లో రాజాలక్ష్మి సాహిత్య అవార్డు గ్రహీతగా గుర్తింపు పొందారు.

బాపు-రమణలు సినీ రంగంలో వున్నా తామరాకు మీద నీటి బిందువుల్లా ఎన్నడూ ప్రలోభాలకు, ప్రశంసలకు, కీర్తి పొందే కల్మష తాపత్రయాలకు దేనికీ తలవంచలేదు.

కథలు రమణ సృష్టిస్తే- బొమ్మలు బాపుల స్నేహబంధం వారి వ్యక్తిత్వాలు అరుదైన, అపురూప జీవన మాధుర్యాన్ని అందించాయి. బహుశా ప్రపంచ కళా, సాహితీ రంగంలో ముప్పుందు అటువంటి సమ్మిళిత మధుర ప్రతిభా హృదయ సౌందర్యం దర్శించగలగడం సాధ్యం కాకపోవచ్చు.



## వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

### మేషం



అనుకూలంగా ఉంటుంది. దూరమైన సన్నిహిత వర్గం తిరిగి చేరువవుతారు. ఆర్థిక ప్రణాళికలను క్రమ పద్ధతిలో రూపొందించుకుంటారు. విదేశీయాన యత్నాలు కలిసి వస్తాయి. శుభ కార్యాలకు ఆహ్వానాలను అందుకుంటారు. ప్రతిభా పాటవాలను కనబరచి పనులను సానుకూలపరచుకుంటారు. పరపతి కలిగిన వారితో పరిచయాలు ఏర్పడతాయి.



### వృషభం

వృత్తి, ఉద్యోగాల పరంగా అధిక శ్రద్ధ కనబరుస్తారు. అనుకూలమైన అధికార పత్రం ద్వారా ప్రత్యక్షంగాగానీ/ పరోక్షంగా కానీ లాభపడతారు. చిన్న చిన్న ప్రయోజనాలతో సంతృప్తిని వ్యక్తం చేయరు. అల్లా-ఉద్దీన్-అద్భుత దీపం కోసం అన్వేషిస్తారు. ప్రజా సంబంధాలను విస్తృతపరచుకుంటారు. ఉన్నతికి ఉపకరించే ప్రతి అంశం పట్ల జాగ్రత్త వహిస్తారు.

### మిథునం



నూతన వ్యాపారాలను ప్రారంభిస్తారు. విందు-వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతనమైన ఫైనాన్షియల్ స్కీముల్లో సభ్యత్వం తీసుకుంటారు. ఎవరు ఏ సహాయం అడిగినా కాదనకుండా సహకరిస్తారు. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. విజయాలు కార్య రూపంలో కనిపించినా అసహనంగా ఉంటారు. మొండిగా వ్యవహరిస్తారు.



### కర్కాటకం

సాధారణంగా ఉంటుంది. ముఖ్యమైన అన్ని విషయాల్లో జాగ్రత్తగా మెలగడం చెప్పదగింది. చికాకు, అసహనం అధికంగా ఉంటాయి. కీలకమైన సంతకాలు, విలువైన పత్రాల భద్రతా విషయంలో జాగ్రత్తలు వహించండి. తేలికగా, సులువుగా పూర్తవుతాయి అనుకున్న పనులు తప్ప సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని, అమలు చేయడం మంచిది కాదు.

### సింహం



మధ్యవర్తి ద్వారా శుభ కార్య ప్రయత్నాలలో ముందడుగు వేస్తారు. వృత్తి పరంగా కనబరచే ఓర్పు మంచి ఫలితాలను ఇస్తుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. క్షణం తీరిక లేకుండా హడావుడిగా కాలం గడుపుతారు. అందుకు తగిన విధంగా ప్రతిఫలం మాత్రం పూర్తి స్థాయిలో లభించదు. గతంలో పాటించిన పొదుపు పథకాలు అక్కరకు వస్తాయి.



### కన్య

ప్రతి విషయాన్ని కీడెంచి మేలెంచమన్న విధంగా చూస్తారు. మీ ప్రయోజనాలు పదిలంగా ఉంటాయి. ఆర్థిక స్థితిగతులు కూడా మెరుగ్గా ఉంటాయి. గోప్యంగా పనులు చేపట్టి వాటిని అభివృద్ధి పథంలో నడిపించడానికి సమాయత్తమవుతారు. క్రీడాకారులకు అనుకూలంగా ఉంటుంది. ఆరోగ్య సూత్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎంతైనా అవసరం.

### తుల



అనుకూలంగా వున్నప్పటికీ ఆర్థిక స్థితి పైన శ్రద్ధ చూపించవలసి ఉంటుంది. ఉద్యోగ, వ్యాపారాల పరంగా లౌక్యం ప్రదర్శించి లాభపడతారు. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు. బహుమతులను అందుకుంటారు. వారాంతంలో జీవిత భాగస్వామితో భేదాభిప్రాయాలు చోటు చేసుకునే సూచనలున్నాయి. గుడ్ విల్‌ను పెంచుకునే విధంగా మీ నడవడికలో కొత్త మార్పులను తీసుకొస్తారు.



### వృశ్చికం

సూత్ర ప్రాయంగా కొన్ని ఒప్పందాలు కుదుర్చుకుంటారు. శుభ వార్తలు వింటారు. పెండింగ్‌లో వున్న రిజిస్ట్రేషన్ పనుల పైన కీలక నిర్ణయాలు తీసుకుంటారు. అరమరికలు లేకుండా మీ మనసులోని భావాలను ఇతరులతో పంచుకుంటారు. ఎదుటివారు కూడా మీతో అదే విధంగా వుండాలని భావిస్తారు. పార్ట్ టైం జాబ్ వర్కులు లాభిస్తాయి. బ్యాంకు రుణాలు ప్రయాస మీద సానుకూలపడతాయి.

### ధనుస్సు



ఉపయుక్తమైన అంశాలను తెలుసుకుంటారు. అకౌంట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధను కనబరచి లాభపడతారు. నూతన వస్తు, వాహనాలను కొనుగోలు చేస్తారు. నిరాశ, నిస్పృహలకు ఏమాత్రం తావివ్వరు. కొత్త వ్యాపారం ప్రారంభించాలనే ఆలోచనలు చోటు చేసుకుంటాయి. బంధు వర్గంతో మాట పట్టింపులు ఏర్పడతాయి. ప్రజా సంబంధాలను వృద్ధి పరచుకోవడానికి ప్రాముఖ్యమిస్తారు.



### మకరం

సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఓ పొరపాటు సమాచారం విని అదే నిజమని భ్రమ పడతారు. పుకార్లను నమ్మకుండా కంటితో చూసిన విషయాలనే నిర్ధారణ చేసుకోవడం మంచిది. ఆహార, ఆరోగ్యం, ప్రయాణ విషయాలలో జాగ్రత్తలు పాటించడం అవసరం. కీలక విషయాలలో మీ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పడం వల్ల మేలు కలుగుతుంది. ఆర్థిక స్థితిగతులు సాధారణంగా ఉంటాయి.

### కుంభం



శ్రమ అధికంగా ఉంటుంది. ఫలితాలు మీరు ఆశించిన స్థాయిలో కాకపోయినా కొంతవరకు మెరుగ్గా ఉంటాయి. సహోదర, సహోదరీ వర్గం యోగక్షేమాలు విచారిస్తారు. సుదూర ప్రాంత ప్రయాణాలకు అనువైన సమయం కాదు. మిత్రులతో శుభ కార్యాల విషయంలో చర్చలు సాగిస్తారు. తాత్కాలిక ప్రయోజనాల కన్నా భవిష్యత్తుకే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు.



### మీనం

శుభ కార్యాల విషయంలో అందరూ మీ మాటలనే అవలంబిస్తారు. లౌక్యంగా వ్యవహరించి పనులలో పురోభివృద్ధిని తీసుకురాగలుగుతారు. అయితే ఒక సమస్యను పరిష్కరిస్తే మరో సమస్య నూతన కోణంలో తారసపడుతుంది. సంతానాభివృద్ధి బాగుంటుంది. పొదుపు పైన దృష్టి సారించడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తారు. ఒకరికి సహాయం చేసి ఆత్మ సంతృప్తి పొందుతారు. ఆరోగ్యం పైన దృష్టి సారిస్తారు.

# తూర్పు దిక్కులో సెప్టిక్ ట్యాంక్ ఉంటే?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




## తూర్పు(మధ్యమ స్థానం)లో సెప్టిక్ ట్యాంక్-శుభం

ఇంటికి తూర్పు మధ్యమ భాగంలో సెప్టిక్ ట్యాంకు సర్వదా వాంఛనీయం. ఓవర్ ఫ్లో తూర్పు/ఉత్తర ఈశాన్యం గుండా బయటకు వెళ్తే సత్ఫలితాలు అనేకం ఉంటాయి. దక్షిణ ఆగ్నేయం గుండా ఓవర్ ఫ్లో వెళ్లినట్లయితే సత్ఫలితాల ఒరవడి కొంత తగ్గుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** కార్య నిర్వహణా దక్షత, పేరు ప్రఖ్యాతులు, ఆర్థికోన్నతి, పదోన్నతి.

## Septic Tank in the East(middle-grade location)-Favourable

A Septic tank in the middle of the East fetches favourable results. If the overflow goes out from the East or North North-East gainful results become plenty. If the overflow goes out from South South-East the gainful results get slightly reduced.

**Result:** Efficiency in work, fame, increasing riches, rise in status.

## తూర్పు(ఉచ్ఛము)లో సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఇంటికి తూర్పు మధ్య భాగం నుండి ఉచ్ఛ స్థానమైన ఈశాన్యం వైపునకు సెప్టిక్ ట్యాంకు ఉన్నట్లయితే సత్ఫలితాలు ఉంటాయి. ఓవర్ ఫ్లో తూర్పు వైపునకు ఉంటే ఫలితాలు ఇనుమడిస్తాయి. ఉత్తర ఈశాన్యం వైపునకంటే ఫలితాల ఒరవడి తగ్గుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** పలుకుబడి, ప్రశాంతత, సర్వతోముఖాభివృద్ధి.

## Septic Tank in the East(High-grade location)-Favourable

A septic tank located between the middle of the East to the high-grade location North-East fetches favourable results. If the overflow is towards East the gainful results get increased. If they are towards North North-East they get reduced.

**Result:** Respect in society, peaceful life, all round development.

## తూర్పులో సెప్టిక్ ట్యాంక్(పోటు)-)-అశుభం

ఇంటి ఉత్తరపు గోడ పారు నుండి తూర్పు ప్రహరీ గోడకు తాడు లాగి చూసినపుడు అది తూర్పున ఉన్న సెప్టిక్ ట్యాంకు మీదుగా పోతే ఆ ఇంటికి తూర్పు సెప్టిక్ ట్యాంకు పోటు దోషం ఉన్నట్టుగా గ్రహించాలి. సెప్టిక్ ట్యాంకు తూర్పున వున్నప్పటికీ ఈ దోషం వలన అనేక చెడు ఫలితాలు ఉంటాయి.

**శుభా శుభ ఫలితాలు:** పేరు ప్రఖ్యాతులకు భంగం వాటిల్లుట, ఆర్థిక, ఆరోగ్య నష్టాలు.

## Septic Tank in the East(Strike)-Unfavourable

If a string, held straight from the boundary of the Northern wall of the house to the Eastern compound wall, encounters the septic tank it means that that the house has the flaw of strike of the Eastern septic tank. This flaw gives several unfavourable results.

**Result:** Good name will get tarnished, monetary losses, ill health.

## తూర్పు ఈశాన్యంలో సెప్టిక్ ట్యాంక్-అశుభం


ఇంటి నుండి ఏ విధమైన పోటు లేనప్పటికీ తూర్పు ఈశాన్యంలో సెప్టిక్ ట్యాంకు ఉన్నట్లయితే అది ఇంటిల్లిపాదికీ దుష్ఫలితాలనిస్తుంది. ఓవర్‌ఫ్లో తూర్పు ఈశాన్యం వైపు ఉన్నా ఉత్తర ఈశాన్యం వైపు ఉన్నా శుభా శుభ ఫలితాల సాంద్రతలో మార్పు ఉండదు.

**శుభా శుభ ఫలితాలు:** ఆత్మస్థైర్యాన్ని కోల్పోవటం, దుష్ప్రవర్తన, ఆర్థిక నష్టం, అసౌఖ్యం.

## Septic Tank in the East North-East-Unfavourable

Though there is no strike of any kind from the house and if the septic tank is in East North-East, it is unfavourable to those living in it. If the overflow is towards East North-East or towards North North-East, it has no effect on results.

**Result:** Loss of mental stability, bad behaviour, monetary losses, unhappiness.




## తూర్పులో సెప్టిక్ ట్యాంక్-అశుభం

తూర్పున ఉన్న ఖాళీ స్థలమంతా వదిలేసి, ఇంటికి దగ్గరగా తూర్పులో సెప్టిక్ ట్యాంకు నిర్మించినట్లయితే తీవ్రతరమయిన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది. తూర్పున వీధి వుంటే దుష్పరిణామాల తీవ్రత అధికమవుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** అనేక విధాలైన తీవ్రతర చెడు పరిణామాలుంటాయి.

# పదరంగం-11

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. అడిగేవాడికి చెప్పేవాడు.... అని సామెత (3)
4. గందరగోళం, తబ్బిబ్బు (4)
6. యుద్ధానికి బయలుదేరడం (4)
7. నహుషుని కొడుకు (3)
8. కవిసార్వభౌముడు (4)
9. వేసవి కాలం (4)
10. గొడవ, పేచీ తిరగబడింది (4)
12. సారాయి (2)
15. దిక్కు (2)
17. మువ్వలు (3)
18. ఎడతెగని ఆలోచన (4)
20. సిద్ధం (3)
21. ఆవకాయకు తోబుట్టువు అటు నుంచి (3)
22. ఒక కేరళ పండుగ (2)
24. ప్రపంచం (2)
25. ముక్కుతో మాట్లాడటం (2)
27...... దీపం కొండంత వెలుగు అని సామెత (3)
28. ఉప్మాతో పాటు తింటే ఆహా! (అటు నుంచి)(4)

### నిలువు

1. రహస్యంగా లాలూచీ పడటం (5)
2. పుకారు (3)
3. వెళ్లిన పని ఏమైంది....? అనడం రివాజు (4)
5. పువ్విలుకాడు (4)
8. మన పొరుగుదేశం (3)
9. నండూరి వారి సృష్టి ఈ అచ్చతెలుగు పాత్ర (2)
11. ఇరుగ్గా ఉండటం వాడుక భాషలో (5)
13. వరంగల్లు పాత పేరు పైకొచ్చింది (4)
14. మట్టిని తవ్వేందుకు వాడే సాధనం (3)
16. వందేళ్లు (4)
19. హొయలు, వయ్యారం (4)
23. విరిగిన పీఠం (3)
24. లోటు, తక్కువ (2)
26. చనిపోవు (2)

**పదరంగం-9కు సరైన జవాబులు పంపించినవారు**

1. కె.ఎస్.మనీష్- విజయవాడ, 2. గుంట్రాతి సుబ్రహ్మణ్యంగౌడ్, రాజంపేట, 3. బి.ప్రదీప్ రెడ్డి - ఘట్‌కేసర్

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,

లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ..............................


..............................


ఊరు : ..............................


## పదరంగం-9 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| వి[1] | జ[2] | యం | | ద్ధి[3] | | అ[4] | | ఏ[5] | ద్ధు |
| | య | | తు[6] | చ | త | ప్ప | కుం | డ | |
| ట[7] | ల | వం | తం | | | చ్చి | | ము[8] | క్క |
| | లి | | | లం[9] | | | దా[10] | హం | |
| | త[11] | మ | ల | పా | కు | లు[12] | | పె[13] | య్య |
| ప్ర[14] | | | | గో | | త[15] | క్కె | డ | |
| చం[16] | ప | క[17] | మా | ల | | సే | | ము | |
| డ | | లి | | టా | | | అ[18] | హం | కా[19] |
| మై | | వి | | ఆ[20] | ద[21] | రు | వు | | ను |
| న[22] | వ | డి | డ | | డి | | ను[23] | ల | క |

# ఈ వారం 'కార్టూన్స్'


ఇలా సెలవులు పెట్టి జీతాల్లో కోత పెట్టేసుకుంటే_
అవతల 'ఉచితాల'కు టాక్సులు ఎవడు కడుతాడు?!
LEAVE
LOSS OF PAY...
మేనేజర్.


మల్లన్ననే కదా..? ఒక్క ఐదేళ్ళు నీ దగ్గరికి
రాకుంటే నన్నే మరిచిపోయావా..!!?
VOTE
Zakir..


సీనియర్ సిటిజన్స్ సీట్లకోసం
జుట్టుకు రంగేసుకోకుండా ఉంటామా.. చెప్పు బావ..!?
Zakir...



చైనాలోని
ఈ గుహను తియాన్మెన్ గుహ
అంటారు. దీనిని సందర్శించాలంటే సుమారు
పదకొండు కి.మీ, అనేక మలుపులు తిరిగిన పర్వత
రోడ్డు గుండా ప్రయాణించాలి. ఈ రహదారిలోని
ప్రయాణ అనుభూతులను మాటల్లో వర్ణించడం
సాధ్యం కాదంటే అతిశయోక్తి కాదు.











